ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234 www.kakatiyanews.com
శుక్రవారం, 14 ఆగస్టు 2026 | సంపుటి: 02 సంచిక: 01 | పేజీలు: 8 వెల: 5

## పెన్షన్లు, కల్యాణలక్ష్మిపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లు వెంటనే ఇవ్వాలి
- ఆడబిడ్డలకు రూ.2,500 హామీ ఏమైంది?
- కేసీఆర్ పథకాలను కొనసాగించలేకపోతున్నారు
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజల్లోకి వెళ్లాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి



5

## హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలి



- ప్రభుత్వ హామీల కమిటీకి స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలి
- ఎన్నికల మేనిఫెస్టో హామీలను కమిటీ పరిధిలోకి తేవాలి
- అధికారులను పిలిచి వివరణ కోరే అధికారం కల్పించాలి
- క్రమం తప్పకుండా సమావేశాలు, స్టడీ టూర్లు నిర్వహించాలి
- బీఆర్ ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

3

# బడికి రాకుంటే.. ఉద్యోగానికి గుడ్‌బై!

- ఏడాది గైర్హాజరైతే సర్వీసు నుంచి తొలగింపు
- ఐదేళ్ల విధులకు దూరమైతే రాజీనామా చేసినట్లే
- పర్యవేక్షణలో విఫలమైతే అధికారులపైనా వేటు
- ప్రభుత్వ బడుల్లో పని సంస్కృతికి పెద్దపీట
- విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా ప్రక్షాళన
- నిర్లక్ష్య ఉపాధ్యాయులపై
- తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల గైర్హాజరుపై రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించనుంది. పాఠశాలలకు సక్రమంగా హాజరుకాకుండా ముందస్తు అనుమతి లేకుండా దీర్ఘకాలం విధులకు దూరంగా ఉండే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకునేందుకు నిర్ణయించింది. నిరంతరం ఏడాది పాటు విధులకు గైర్హాజరైతే సర్వీసు నుంచి తొలగించే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. ఐదేళ్లపాటు విధులకు దూరంగా ఉంటే సర్వీసుకు రాజీనామా చేసినట్లుగా పరిగణించనున్నట్లు పేర్కొంది. గతంలో నిబంధనలు ఉన్నప్పటికీ వాటి అమలులో నిర్లక్ష్యం కనిపించిందన్న అభిప్రాయంతో.. ఇకపై క్షేత్రస్థాయిలో ఎలాంటి మినహాయింపులు లేకుండా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు బోధనా ప్రమాణాలపై నేరుగా ప్రభావం చూపుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధ్యాయులు తరచూ గైర్హాజరైతే పేద, బలహీన వర్గాల విద్యార్థుల చదువులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. తరగతి గదిలో ఉపాధ్యాయుల అందుబాటు లేకపోవడంతో విద్యార్థులు నాణ్యమైన బోధనకు దూరమవుతున్న పరిస్థితికి చెక్ పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ముందస్తు అనుమతి లేకుండా దీర్ఘకాలం విధులకు గైర్హాజరయ్యే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

........(తరువాయి 2లో)



## రేవంత్‌రెడ్డి.. సీఎంవా? రియల్ ఎస్టేట్ ఏజెంటువా?

- హెరిటేజ్ భూముల వేలాన్ని ఉపసంహరించాలి
- వివాదాలు తేలకముందే వేలం ఎలా వేస్తారు?
- కొనుగోలు చేస్తే న్యాయపరమైన చిక్కులు తప్పవు
- రాయదుర్గ్ భూములపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** రాయదుర్గ్‌లోని హెరిటేజ్ భూముల వేలం ప్రతిపాదనపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ''రేవంత్‌రెడ్డి.. నువ్వు ముఖ్యమంత్రివా? లేక రియల్ ఎస్టేట్ ఏజెంటువా? ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా?'' అంటూ సీఎం తీరును ప్రశ్నించారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నంబర్ 83/1లోని 10.63 ఎకరాల భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో టీజీఐఐసీ వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని బీఆర్ఎస్ తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన బహిరంగ లేఖలో డిమాండ్ చేశారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారని హరీశ్‌రావు గుర్తుచేశారు.

........(తరువాయి 2లో)

# పేదల సొంతింటికి పెద్దపీట!

మీ సొంతింటి కలను నిజం చేసేందుకు సోదరుడిగా అండగా ఉంటా





- తొలి విడతలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
- కూకట్‌పల్లిని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేస్తాం
- 22ఏ విషయంలో సొంత భూములు కోల్పోకుండా చూస్తాం
- 'ఇందిరమ్మ ఇండ్లు టవర్స్'కు శ్రీకారంలో సీఎం రేవంత్ రెడ్డి



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** పట్టణ ప్రాంతాల్లో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు 'ఇందిరమ్మ ఇండ్లు టవర్స్'కు శ్రీకారం చుట్టామని, తొలి విడతలో లక్ష ఇళ్లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ''మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటా'' అని ప్రజలకు భరోసా ఇచ్చారు. 'ఇందిరమ్మ ఇండ్లు' టవర్స్ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయాలని మంత్రి శ్రీధర్‌బాబును ఆదేశించారు. గతంలో తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రజలు ఆశించిన మేరకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయానని రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు కూకట్‌పల్లి అభివృద్ధికి అన్ని రకాల అధికారం ఉందని, ప్రజలు తమకు ఎలాంటి అభివృద్ధి కావాలో అడిగి చేయించుకోవాలని సూచించారు.

**తొలి విడతలో లక్ష ఇళ్లు**

పట్టణాల్లో పేదలకు ఇళ్లు

........(తరువాయి 2లో)

## హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా!

- నేడు ట్యాంక్‌బండ్‌పై బీజేపీ భారీ తిరంగా యాత్ర
- అంబేడ్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ
- కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రముఖుల హాజరు
- దేశభక్తి స్ఫూర్తితో తరలిరావాలి : డా.మేకల శిల్పారెడ్డి



3

## ములుగు ముస్తాబు!


- మేడారం నుంచి మహిళలకు 'పింఛన్'
- వనదేవతల సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి పూజలు
- పైలాన్, కలెక్టరేట్ పనులకు తుది మెరుగులు
- రూ.16 వేల కోట్ల హ్యామ్ రోడ్లకు శ్రీకారం
- సీఎంను ఆహ్వానించేందుకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క



3

# వైద్య ఆరోగ్య శాఖలో డిప్యూటేషన్ల దందా!

- మౌఖిక ఉత్తర్వులతోనే ఇష్టారాజ్యంగా సిబ్బంది మార్పు
- ఒక్కో డిప్యూటేషన్‌కు రూ.2 లక్షల వరకు వసూళ్ల ఆరోపణలు
- 15మందికి పైగా సిబ్బందిని అటు.. ఇటు మార్చినట్లు సమాచారం
- డ్యూటీ ఒకచోట.. జీతం మరోచోట.. ఆస్పత్రుల్లో గందరగోళం
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్లకూ రూ.100 చొప్పున వసూళ్లంటూ విమర్శలు
- నల్లగొండ జిల్లా వైద్యారోగ్య శాఖలో డిప్యూటేషన్ల వ్యవహారంపై ఆరోపణల వెల్లువ



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** నల్లగొండ జిల్లా వైద్యారోగ్య శాఖలో డిప్యూటేషన్ల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండానే సిబ్బందిని ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి పంపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో డిప్యూటేషన్‌కు రూ.2 లక్షల వరకు ముడుపులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు శాఖలో చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిప్యూటేషన్‌కు సంబంధించి స్పష్టమైన ప్రొసీడింగ్స్ ఉండాల్సి ఉన్నప్పటికీ.. ఇక్కడ మాత్రం మౌఖిక ఆదేశాలతోనే వ్యవహారం నడుస్తోందని సిబ్బంది ఆరోపిస్తున్నారు.

........(తరువాయి 2లో)

## సీతారామ పనుల్లో వేగం పెంచాలి

- పెండింగ్ పనులు పూర్తి చేసి సాగునీరందించాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరిన మంత్రి తుమ్మల
- సాగర్ ఆయకట్టుకు రెండు మూడు రోజుల్లో నీరు
- 532 ఎకరాల భూసేకరణ వేగవంతం.. జూలూరుపాడు టన్నెల్ పనులకూ ప్రాధాన్యం
- రూ.45 కోట్లతో భూసేకరణ.. ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ ప్రతిపాదన

5



## ఓట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలి

**73 లక్షల ఓట్ల తొలగింపు చిన్న విషయం కాదు**

- 64 లక్షల ఓట్లను 'అనామలీ'గా గుర్తించడం ప్రమాదకరం
- అర్హులైన ప్రతి ఓటరుకు తిరిగి ఓటు హక్కు కల్పించేలా చూడాలి
- కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- చిన్న నిర్లక్ష్యాన్ని కూడా సహించం.. పనిచేయని బీఎల్ఏలపై చర్యలు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

5



www.kakatiyanews.com
ఉత్తరం
కాకతీయ
శుక్రవారం 14 ఆగస్టు 2026


# వైద్య ఆరోగ్య శాఖలో డిప్యూటేషన్ల దందా!

(మొదటిపేజీ తరువాయి)
నకిరేకల్, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రుల్లో సుమారు 15 మందికి పైగా సిబ్బందిని ఇష్టారాజ్యంగా మార్చినట్లు సమాచారం. వైద్య సేవలు అత్యవసరమైన ప్రాంతీయ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ.. అందుబాటులో ఉన్న సిబ్బందిని కూడా డిప్యూటేషన్ల పేరుతో ఇతర ప్రాంతాలకు తరలిస్తుండటంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది కొరతతో సేవలపై ప్రభావం పడుతోందని తెలుస్తోంది.

**ఉత్తర్వుల్లేకుండానే బదిలీలు?**
ప్రభుత్వ ఉద్యోగిని ఒకచోట నుంచి మరోచోటుకు డిప్యూటేషన్‌పై పంపాలంటే నిబంధనల ప్రకారం సంబంధిత అధికారి ఉత్తర్వులు, విధుల వివరాలు, కాలపరిమితి తదితర అంశాలతో అధికారిక ప్రొసీడింగ్స్ ఉండాల్సి ఉంటుంది. అయితే నల్లగొండ జిల్లాలో కొందరు సిబ్బందిని ఎలాంటి లిఖితపూర్వక ఉత్తర్వులు లేకుండానే మౌఖిక ఆదేశాలతో విధులు మార్చుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దేవరకొండ ప్రాంతీయ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ సిబ్బందిని నకిరేకల్ ఆస్పత్రికి పంపినట్లు చెబుతున్నారు. నాగార్జునసాగర్ కమలా నెహ్రూ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఇద్దరు సిబ్బందిని కూడా మౌఖిక ఆదేశాలతో మిర్యాలగూడకు పంపినట్లు సమాచారం. డ్యూటీ ఒక ప్రాంతంలో చేస్తుండగా.. జీతం మాత్రం మరో ప్రాంతంలో చెల్లించే పరిస్థితులు కూడా ఉన్నాయని శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

డబ్బులు చెల్లించిన వారికి నచ్చిన చోట డిప్యూటేషన్ ఇప్పిస్తున్నారనే ఆరోపణలు ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతున్నాయి. తమకు అనుకూలంగా ఉన్న సిబ్బందికి ప్రాధాన్యం ఇస్తూ.. నిబంధనల ప్రకారం పనిచేసే వారికి అన్యాయం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం వెనుక జిల్లా స్థాయి అధికారి కీలక పాత్ర పోషిస్తున్నారని కొందరు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. సదరు అధికారి ఏళ్ల తరబడి ఒకే స్థానంలో కొనసాగుతున్నారని, దీంతో శాఖలో తనకంటూ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. డిప్యూటేషన్ల కోసం వచ్చే వారి నుంచి వసూళ్ల వ్యవహారాన్ని ఓ హెడ్‌నర్సు ద్వారా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

**చిల్లర వసూళ్లపైనా ఆరోపణలు**
డిప్యూటేషన్ల వ్యవహారానికే పరిమితం కాకుండా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల విషయంలోనూ వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు తెరపైకి వస్తున్నాయి. సర్టిఫికెట్ల కోసం వచ్చే విద్యార్థుల నుంచి రూ.100 చొప్పున తీసుకుంటున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. రశీదులు లేకుండా ఈ తరహా వసూళ్లు సాగుతున్నాయనే ఫిర్యాదులు ఉన్నట్లు తెలుస్తోంది. పేదలు, విద్యార్థులు, ఇతర అవసరాల కోసం ఆస్పత్రులకు వచ్చే ప్రజల నుంచి అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తే వైద్యశాఖపై ప్రజల్లో నమ్మకం దెబ్బతింటుందని పలువురు పేర్కొంటున్నారు. ఆరోగ్య సేవల రంగంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవ చేయాల్సింది పోయి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు నిజమైతే ఇది తీవ్రమైన అంశమని అభిప్రాయపడుతున్నారు. ప్రాంతీయ ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండటం అత్యవసరం. ఇప్పటికే కొన్ని ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతతో సేవల నిర్వహణ కష్టంగా ఉందని చెబుతున్నారు. అలాంటి చోట్ల పనిచేస్తున్న వారిని డిప్యూటేషన్ల పేరుతో మరో ప్రాంతానికి పంపడం వల్ల ఉన్న సిబ్బందిపై అదనపు భారం పడటంతోపాటు రోగులకు వైద్య సేవలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ల్యాబ్ టెక్నీషియన్లు, నర్సులు వంటి సిబ్బంది కొరత నేరుగా రోగులపై ప్రభావం చూపుతుంది. ఒకరి వ్యక్తిగత అవసరాలు, పైరవీలు లేదా ఆర్థిక ప్రయోజనాల కోసం సిబ్బంది కేటాయింపులు మార్చితే ప్రభుత్వ ఆస్పత్రుల అసలు లక్ష్యమే దెబ్బతింటుందని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.

**విచారణకు డిమాండ్**
జిల్లా వైద్యారోగ్య శాఖలో జరుగుతున్న డిప్యూటేషన్లపై సమగ్ర విచారణ చేపట్టాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు. ఏయే ఉత్తర్వుల ఆధారంగా సిబ్బందిని డిప్యూటేషన్‌పై పంపారు? ఎవరి ఆదేశాల మేరకు మార్పులు చేశారు? డిప్యూటేషన్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ఉన్నాయా? అనే అంశాలను ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది. అలాగే ఆరోపణల్లో పేర్కొంటున్న రూ.2 లక్షల వసూళ్ల వ్యవహారంపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేస్తున్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్లకు సంబంధించిన వసూళ్ల ఆరోపణలపైనా రికార్డులను పరిశీలించాలని కోరుతున్నారు. ఆరోగ్యశాఖలో అవినీతిని అరికట్టాల్సిన ఉన్నతాధికారులే ఈ ఆరోపణలపై స్పందించకపోతే క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరింత దిగజారే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డిప్యూటేషన్ల నుంచి ధ్రువీకరణ పత్రాల వరకు ప్రతి వ్యవహారాన్ని నిబంధనల ప్రకారం నిర్వహించేలా చర్యలు తీసుకోవడంతోపాటు, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పేదల సొంతింటికి పెద్దపీట!

(మొదటిపేజీ తరువాయి)
నిర్మించి ఇచ్చేందుకు ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కార్యక్రమాన్ని ప్రారంభించామని సీఎం తెలిపారు. గతంలో డబ్బా ఇళ్లు వద్దు.. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పిన వారు కనీసం ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించామని పేర్కొన్నారు.

**మహిళా సంఘాలకు రూ.65 వేల కోట్ల రుణాలు**
ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని ముఖ్యమంత్రి అన్నారు. స్వయం సహాయక సంఘాలకు రూ.65 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని తెలిపారు. మహిళలను బస్సులకు యజమానులను చేశామని, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించామని చెప్పారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లు ఏర్పాటు చేశామని వివరించారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి ప్రభుత్వంపైకి ఉసిగొల్పినా మహిళా సంఘాల విషయంలో వెనక్కి తగ్గలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచేలా ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు.

**22ఏపై ఆందోళన వద్దు**
22ఏ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం స్పష్టం చేశారు. ''మీ సొంత భూములు కోల్పోకుండా చూసే బాధ్యత మాది. ఈ విషయంలో మీకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు'' అని హామీ ఇచ్చారు. సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. పదేళ్ల గత ప్రభుత్వ పాలనను, రెండేళ్ల తమ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తున్నామని అన్నారు. ''నాకు వయసు ఉంది.. ఓపిక ఉంది.. మీకు మంచి చేయాలన్న సంకల్పం ఉంది. మీరు అండగా ఉండండి.. అభివృద్ధి చేసి చూపిస్తా'' అని సీఎం పేర్కొన్నారు. కూకట్‌పల్లి ప్రజలు తనను పార్లమెంట్ సభ్యుడిగా ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు అదే ప్రాంత అభివృద్ధికి అన్ని రకాల అధికారాలు ఉన్నాయని, కూకట్‌పల్లిని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు సూచించారు.

# కొడంగల్ ఎత్తిపోతలలో అక్రమాలు



- లోకాయుక్తను ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యేలు
- నిర్వాసితులకు బదులు అస్మదీయులకు లబ్ధి చేకూర్చే కుట్ర
- నారాయణపేట మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- నకిలీ పాసుపుస్తకాలతో భూదోపిడీ.. విజిలెన్స్ విచారణ జరపాలి
- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై అనుమానాలు.. అనుమతులు లేకుండానే పనులా?
- మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌నాయుడు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యేలు లోకాయుక్తను ఆశ్రయించారు. నిర్వాసితులకు దక్కాల్సిన పరిహారాన్ని ఇతరులకు కట్టబెట్టేందుకు నకిలీ పాసుపుస్తకాలు, పట్టాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై కోట్ల రూపాయల కుంభకోణానికి తెరతీశారని విమర్శించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నారాయణపేట మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణలో జరుగుతున్న అవకతవకలపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వాస్తవంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు కాకుండా ఇతరులకు లబ్ధి చేకూర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దొంగ పాసుపుస్తకాలు, పట్టాలు సృష్టించి కోట్ల రూపాయలను అస్మదీయులు, అనుయాయులకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఎత్తిపోతల పథకంలో భాగంగా రూపొందించిన నిర్వాసితుల జాబితాను ఇప్పటికే మూడుసార్లు మార్చారని, తరచూ పేర్లను మారుస్తున్నారని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, వారి పీఏలు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్‌ను రెండు నెలలకే బదిలీ చేయడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. భూనిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

**విజిలెన్స్‌తో విచారణ జరపాలి**
కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎత్తిపోతల పథకంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నకిలీ పాసుపుస్తకాలు సృష్టించి కొందరు అక్రమంగా లబ్ధి పొందుతున్నారని విమర్శించారు. లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతోనూ భారీగా భూ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి, ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి, అధికారులు కుమ్మక్కై భూదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. నష్టపరిహారం పంపిణీలోనూ అక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ఇండస్ట్రియల్ కారిడార్‌పై విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కారిడార్ పరిధిలో పెద్ద ఎత్తున లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారని, వాటిపైనా విచారణ జరిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులే లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. విచారణ జరపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

**ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపైనా సందేహాలు**
మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. బినామీ పేర్లతో అక్రమంగా నిర్వాసితుల జాబితా రూపొందించి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులే అక్రమాలకు తెరలేపారని విమర్శించారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం సాధ్యాసాధ్యాలపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. కాల్వల ద్వారా కాకుండా దాదాపు 90 కిలోమీటర్ల మేర పైపులైన్ల ద్వారా నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించారని తెలిపారు. ఒక టీఎంసీ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్ నుంచి ఏకంగా ఏడు టీఎంసీల నీటిని తరలించేందుకు ప్రణాళికలు ఎలా సాధ్యమవుతాయో అర్థం కావడం లేదన్నారు. రిజర్వాయర్‌లో ఒక టీఎంసీ నీరు చేరడానికే నెల రోజులు పడుతుందని, అలాంటప్పుడు ఏడు టీఎంసీల నీటిని ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం, పర్యావరణ అనుమతులు లేవని, ప్రాజెక్టు నిర్మాణ వ్యవహారం గ్రీన్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉందని రామ్మోహన్‌నాయుడు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా కేవలం కాంట్రాక్టు కమిషన్ల కోసమే ప్రాజెక్టును రూపొందిస్తున్నారని విమర్శించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు మేలు చేసేందుకే ఈ ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. ప్రాజెక్టులో వేల కోట్ల అవినీతి జరుగుతోందని పేర్కొన్నారు.

## పేదల సొంతింటికి పెద్దపీట!

(మొదటిపేజీ తరువాయి)
నిర్మించి ఇచ్చేందుకు ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కార్యక్రమాన్ని ప్రారంభించామని సీఎం తెలిపారు. గతంలో డబ్బా ఇళ్లు వద్దు.. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పిన వారు కనీసం ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా? అని ప్రశ్నించారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించామని పేర్కొన్నారు.

**మహిళా సంఘాలకు రూ.65 వేల కోట్ల రుణాలు**
ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని ముఖ్యమంత్రి అన్నారు. స్వయం సహాయక సంఘాలకు రూ.65 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని తెలిపారు. మహిళలను బస్సులకు యజమానులను చేశామని, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించామని చెప్పారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లు ఏర్పాటు చేశామని వివరించారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి ప్రభుత్వంపైకి ఉసిగొల్పినా మహిళా సంఘాల విషయంలో వెనక్కి తగ్గలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచేలా ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు.

**22ఏపై ఆందోళన వద్దు**
22ఏ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం స్పష్టం చేశారు. ''మీ సొంత భూములు కోల్పోకుండా చూసే బాధ్యత మాది. ఈ విషయంలో మీకు ఎలాంటి ఆందోళన అవసరం లేదు'' అని హామీ ఇచ్చారు. సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. పదేళ్ల గత ప్రభుత్వ పాలనను, రెండేళ్ల తమ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని రేవంత్‌రెడ్డి కోరారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తున్నామని అన్నారు. ''నాకు వయసు ఉంది.. ఓపిక ఉంది.. మీకు మంచి చేయాలన్న సంకల్పం ఉంది. మీరు అండగా ఉండండి.. అభివృద్ధి చేసి చూపిస్తా'' అని సీఎం పేర్కొన్నారు. కూకట్‌పల్లి ప్రజలు తనను పార్లమెంట్ సభ్యుడిగా ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని రేవంత్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు అదే ప్రాంత అభివృద్ధికి అన్ని రకాల అధికారాలు ఉన్నాయని, కూకట్‌పల్లిని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు సూచించారు.

# రేవంత్‌రెడ్డి.. సీఎంవా? రియల్ ఎస్టేట్ ఏజెంటువా?

(మొదటిపేజీ తరువాయి)
నాడు ప్రభుత్వ భూములను కాపాడాలని కోర్టు మెట్లు ఎక్కిన రేవంత్‌రెడ్డి.. నేడు ముఖ్యమంత్రి హోదాలో అదే భూములపై మూడో పక్ష హక్కులు ఏర్పడేలా వేలానికి ఎలా అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. ''ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా?'' అని నిలదీశారు.

**హెరిటేజ్ భూములే.. వేలం ఎందుకు?**
సర్వే నంబర్ 83ను జీవో ఎంఎస్ నంబర్ 4 ద్వారా హెరిటేజ్ సైట్‌గా గుర్తించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. అలాంటి భూములను పరిరక్షించాల్సిన ప్రభుత్వమే వాటిని వేలం వేసి విక్రయించేందుకు ఎందుకు తొందరపడుతోందని ప్రశ్నించారు. ''నాడు ఎన్విరాన్‌మెంట్ భూములు..నేడు హెరిటేజ్ భూములా? ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా?'' అంటూ విమర్శించారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలను ఎకరాకు సుమారు రూ.237 కోట్ల చొప్పున వేలం వేయడానికి ప్రయత్నించగా ఎస్‌బీఐ కోర్టును ఆశ్రయించిందని, ఆ వ్యవహారంలో కోర్టు ఆంక్షలు విధించిందని తెలిపారు. ప్రస్తుతం ఆ అంశం హైకోర్టు పరిధిలో ఉందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఈ భూమిపై యాజమాన్య వివాదాలు, హెరిటేజ్ అంశం, వక్ఫ్ హక్కులకు సంబంధించిన వివాదాలు, ఇతర కోర్టు కేసులు ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇన్ని వివాదాలు ఉన్నప్పుడు భూమిపై హక్కులు ఎవరివో తేల్చకుండా వేలం వేయడం ఎలా సాధ్యమని నిలదీశారు. ''భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోంది?'' అని ప్రశ్నించారు.

**రూ.2 వేల కోట్ల భూమిని అమ్మే హక్కెవరిచ్చారు?**
రాయదుర్గ్‌లోని హెరిటేజ్ భూముల విలువ సుమారు రూ.2 వేల కోట్లు ఉంటుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన విలువైన ఆస్తులను విక్రయించే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని విమర్శించారు. ''ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము'' అన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాటలకు విలువ లేదా అని హరీశ్‌రావు నిలదీశారు. ప్రభుత్వ భూముల వేలంపై సీఎం వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి సైతం సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని ఘాటుగా విమర్శించారు. సుప్రీంకోర్టు సైతం వివాదాస్పద ఆస్తులను పరిరక్షించాల్సిన అవసరాన్ని, కొత్తగా మూడో పక్ష హక్కులు ఏర్పడకుండా చూడాల్సిన అంశాన్ని స్పష్టం చేసిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు.


**కొనుగోలుదారులకూ హెచ్చరిక**
ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న టీజీఐఐసీ వేలాలను వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. సర్వే నంబర్ 83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బహిర్గతం చేసి సమగ్ర విచారణ జరపాలని కోరారు. భూమిపై హక్కులు, వివాదాలు తేలకముందే వేలంలో కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో న్యాయపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ''రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించండి. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండండి. లేదంటే చరిత్రహీనుడిగా మిగిలిపోతారు'' అని హరీశ్‌రావు తన బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

# బడికి రాకుంటే.. ఉద్యోగానికి గుడ్‌బై!

(మొదటిపేజీ తరువాయి)
ఏడాది పాటు నిరంతరం విధులకు దూరంగా ఉంటే సర్వీసు నుంచి తొలగించే చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఐదేళ్లపాటు విధులకు హాజరుకాకపోతే సర్వీసుకు రాజీనామా చేసినట్లుగా పరిగణించే నిబంధనను అమలు చేయనున్నారు.

**అధికారులదీ బాధ్యతే..**
గైర్హాజరైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడంలో ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులు నిర్లక్ష్యం వహిస్తే వారిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేవలం ఉపాధ్యాయుడి గైర్హాజరును నమోదు చేయడం కాకుండా.. నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పర్యవేక్షణ అధికారులపై ఉంటుంది. ఎవరైనా ఉపాధ్యాయుడు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే వెంటనే హాజరు రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదించాలి. చర్యలు తీసుకోవడంలో జాప్యం జరిగితే తప్పు చేసిన వారు తప్పించుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అందువల్ల స్థానిక స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేసింది.

**బడుల్లో క్రమశిక్షణే కీలకం**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను



పెంచడంతో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యత, బోధనా ప్రమాణాల మెరుగుదలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఉపాధ్యాయుల హాజరుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. పాఠశాలలో ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా అందుబాటులో ఉంటేనే బోధన సజావుగా సాగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల గైర్హాజరు ప్రభావం విద్యార్థులపై ఎక్కువగా పడుతోంది. తరగతులు సక్రమంగా నిర్వహించకపోవడం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యం తగ్గిపోవడం వంటి సమస్యలకు ఇది కారణమవుతోంది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు కఠిన నిబంధనల అమలుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

**కక్షసాధింపునకు తావులేకుండా..**
కఠిన నిబంధనలు అమలు చేస్తున్నప్పటికీ నిజమైన అనారోగ్యం, అనివార్య పరిస్థితులతో విధులకు హాజరుకాలేని ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూడాల్సిన అవసరం ఉంది. అనుమతులు, వైద్య ధ్రువపత్రాలు, సెలవు వివరాలు తదితర అంశాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఎలాంటి కక్షసాధింపు చర్యలకు తావులేకుండా పూర్తి స్థాయి విచారణ అనంతరం చర్యలు ఉండాలని విద్యావర్గాలు సూచిస్తున్నాయి. అదేవిధంగా గైర్హాజరు రికార్డులను పక్కాగా నిర్వహించడం, నోటీసులు సకాలంలో జారీ చేయడం, సంబంధిత ఉపాధ్యాయుడి వివరణ తీసుకోవడం వంటి ప్రక్రియలను పారదర్శకంగా అమలు చేయాల్సి ఉంటుంది. డిజిటల్ హాజరు వ్యవస్థను సమర్థంగా వినియోగిస్తే ఉపాధ్యాయుల హాజరుపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**శిక్షలతోపాటు ప్రోత్సాహం**
ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాలల్లో వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బోధనకు అనుకూలమైన వాతావరణం, అవసరమైన సదుపాయాలు ఉంటే ఉపాధ్యాయులు మెరుగైన పనితీరు కనబరిచే అవకాశం ఉంటుంది. ఒకవైపు అనధికార గైర్హాజరుపై కఠిన చర్యలు.. మరోవైపు విధులను సమర్థంగా నిర్వహించే ఉపాధ్యాయులను ప్రోత్సహించే విధానం అమలు చేస్తే ప్రభుత్వ విద్యారంగంలో పని సంస్కృతి మెరుగుపడే అవకాశం ఉంది. ప్రభుత్వ బడులపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ఉపాధ్యాయుల హాజరు, బోధన, పర్యవేక్షణ వ్యవస్థలు పటిష్ఠంగా పనిచేయాల్సి ఉంటుంది. అప్పుడే ప్రభుత్వం చేపడుతున్న విద్యారంగ ప్రక్షాళనకు ఆశించిన ఫలితాలు దక్కే అవకాశం ఉంది.

# గనుల కేటాయింపుల్లో పారదర్శకతే లక్ష్యం

- ఈ-వేలంతో గనుల కేటాయింపులు.. రాష్ట్రాల ఆదాయం పెంచాం
- కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



**కాకతీయ, న్యూఢిల్లీ :** బొగ్గు, గనుల రంగంలో పారదర్శకత తీసుకురావడంతో పాటు రాష్ట్రాల ఆదాయాన్ని పెంచేలా గత 12 ఏళ్లుగా నరేంద్ర మోదీ ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గనుల కేటాయింపులను గతంలో మాదిరిగా కాకుండా పారదర్శకమైన ఈవేలం విధానంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో 2015, 2020లో పలు సంస్కరణలు తీసుకొచ్చామని, ఇప్పటివరకు 141 బొగ్గు గనుల వేలం ప్రక్రియ పూర్తికాగా.. 105 మినరల్ బ్లాకుల్లో ఉత్పత్తి ప్రారంభమైందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సంస్కరణల వల్ల రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పెరిగిందని కిషన్‌రెడ్డి వివరించారు. 2014కు ముందు రాష్ట్రాలకు రెవెన్యూ షేర్ ద్వారా రూ.13,258 కోట్లు మాత్రమే వచ్చేదని, ప్రస్తుతం రూ.71 వేల కోట్లకు పెరిగిందన్నారు. గతంలో రాష్ట్రాలకు 65 శాతం రెవెన్యూ మాత్రమే దక్కగా.. ప్రస్తుతం 88 శాతం అందుతోందని పేర్కొన్నారు. కేంద్రం వాటా 35 శాతం నుంచి 12 శాతానికి తగ్గిందన్నారు. మినరల్స్ దేశ సంపదని, వాటి ప్రయోజనాలు అన్ని వర్గాల ప్రజలకు అందాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

బొగ్గు రంగంలోనూ రాష్ట్రాల ఆదాయం భారీగా పెరిగిందని కిషన్‌రెడ్డి తెలిపారు. 201415లో రాష్ట్రాలకు దాదాపు రూ.12 వేల కోట్ల ఆదాయం రాగా.. ప్రస్తుతం రూ.58,592 కోట్లకు చేరిందన్నారు. గతంలో 55 శాతం ఉన్న రాష్ట్రాల వాటా ఇప్పుడు 90 నుంచి 96 శాతానికి పెరిగిందని చెప్పారు. కేంద్రం తన వాటాను 45 శాతం నుంచి 4 నుంచి 10 శాతానికి తగ్గించుకుందని వివరించారు. ఆక్షన్ ప్రీమియం, రాయల్టీ మొత్తాన్ని వంద శాతం రాష్ట్రాలకే అందిస్తున్నామని, ఇందులో కేంద్రం ఒక్క రూపాయి కూడా తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రాలు బాగుంటేనే కేంద్రం బాగుంటుందనే సమాఖ్య స్ఫూర్తితో ముందుకు సాగుతున్నామని, వివిధ రాష్ట్రాలతో చర్చించిన అనంతరం తదుపరి మార్గదర్శకాలను తీసుకొస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు.

# ములుగు ముస్తాబు..!





- మేడారం నుంచి మహిళలకు 'పింఛన్'
- వనదేవతల సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి పూజలు
- పైలాన్, కలెక్టరేట్ పనులకు తుది మెరుగులు
- రూ.16 వేల కోట్ల హ్యామ్ రోడ్లకు శ్రీకారం
- సీఎంను ఆహ్వానించేందుకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క



కాకతీయ,ములుగు ప్రతినిధి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనతో ములుగు జిల్లాలో సందడి నెలకొంది. ఈ నెల 16న సీఎం ములుగులో పర్యటించనుండటంతో అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. వనదేవతల కొలువైన మేడారం నుంచే ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్ల పంపిణీకి సీఎం శ్రీకారం చుట్టనుండటంతో ఈ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. సమ్మక్క–సారలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ములుగు జిల్లా కేంద్రానికి చేరుకోనున్న సీఎం.. నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. దీంతో మేడారం నుంచి ములుగు వరకు అధికారులు ఏర్పాట్లను పరుగులు పెట్టిస్తున్నారు. పైలాన్ నిర్మాణం తుది దశకు చేరుకోగా.. కలెక్టరేట్ భవన సముదాయం సైతం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.

## తల్లుల చెంత నుంచే పింఛన్..

వనదేవతల సన్నిధి నుంచి అర్హులైన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించనున్నట్లు మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరించి అర్హులను గుర్తించి పింఛన్లు అందించనున్నట్లు చెప్పారు. సమ్మక్క–సారలమ్మ తల్లుల దీవెనలతో మహిళలు సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని మేడారం నుంచే ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు.

## పైలాన్‌కు తుది మెరుగులు..

సీఎం పర్యటన నేపథ్యంలో మేడారం, గట్టమ్మ, నూతన కలెక్టరేట్ ప్రాంతాల్లో పనులు వేగంగా సాగుతున్నాయి. గురువారం మంత్రి సీతక్క కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. పైలాన్ నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలతో గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి జాప్యానికి తావులేకుండా అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టరేట్ భవన సముదాయంలో వివిధ విభాగాల కార్యాలయాలు, సమావేశ మందిరాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించిన మంత్రి.. పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు, రహదారులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. సీఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## మేడారంపై ప్రత్యేక దృష్టి..

మేడారం ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని సీతక్క తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే రెండుసార్లు మేడారం వచ్చి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని గుర్తుచేశారు. తాజా పర్యటనలోనూ ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి భవిష్యత్ విస్తరణ, అభివృద్ధి పనులపై సీఎం సూచనలు, ఆదేశాలు ఇవ్వనున్నారని చెప్పారు. సీఎం ఆలోచనలు, మార్గదర్శకత్వానికి అనుగుణంగా మేడారాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. సీఎం పర్యటన సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

## రూ.16 వేల కోట్ల హ్యామ్ రోడ్లు..

మేడారం కార్యక్రమాల అనంతరం సీఎం ములుగు జిల్లా కేంద్రానికి చేరుకోనున్నారు. గట్టమ్మ సమీపంలో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో మూడు విడతల్లో సుమారు రూ.16 వేల కోట్లతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల అభివృద్ధి పనుల పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించాలనే లక్ష్యంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో ఈ పనులు చేపడుతున్నట్లు సీతక్క తెలిపారు.

## కలెక్టరేట్ ప్రారంభం..

హ్యామ్ రోడ్ల పైలాన్ ఆవిష్కరణ అనంతరం సీఎం నూతన కలెక్టరేట్ భవన సముదాయానికి చేరుకోనున్నారు. తొలుత తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, అనంతరం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభించనున్నారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసే సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సీతక్క స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏటూర్‌నాగారం ఏఎస్పీ మనన్ భట్, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్–గ్యాస్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

- మార్జిన్ పెంచాలని కేంద్ర మంత్రికి ఎంపీ వద్దిరాజు వినతి
- ఎనిమిదేళ్లుగా మారని కమీషన్.. పెంచాల్సిన అవసరం ఉందని వెల్లడి
- డీలర్ల సమస్యలపై మంత్రి హర్దీప్ సింగ్ పూరీ సానుకూల స్పందన



కాకతీయ, ఖమ్మం బ్యూరో : దేశవ్యాప్తంగా పెట్రోలియం, డీజిల్, సహజవాయువు, ఎల్‌పీజీ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం పార్లమెంట్ ఆవరణలో పెట్రోలియం, సహజవాయువు శాఖల మంత్రి హర్దీప్ సింగ్ పూరీని కలిసి వినతిపత్రం అందజేశారు. డీలర్లకు చెల్లిస్తున్న మార్జిన్(కమీషన్)ను పెంచాలని యునైటెడ్ పెట్రోలియం డీలర్స్, ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, హర్యానా, పశ్చిమ బెంగాల్, బీహార్ తదితర రాష్ట్రాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తనతో పాటు స్థాయీ సంఘం చైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరేను ఇటీవల కలిసి తమ సమస్యలను వివరించినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా డీలర్లకు ఎనిమిదేళ్ల క్రితం నిర్ణయించిన మార్జిన్‌నే ఇప్పటికీ కొనసాగిస్తున్నారని ఎంపీ పేర్కొన్నారు. మారిన పరిస్థితులు, పెరిగిన నిర్వహణ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని మార్జిన్‌ను పెంచాల్సిన అవసరం ఉందని వివరించారు. దీనిపై కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

# ఈసీ పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలు

కాకతీయ, హైదరాబాద్ : ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలు వస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయం దృష్టికి వచ్చింది. ఓటరు గుర్తింపు కార్డు, ఎన్యూమరేషన్ ఫారమ్‌లోని వివరాలు సరిపోలడం లేదని, అందువల్ల ఫారమ్ తిరస్కరణకు గురైందంటూ కొందరికి సందేశాలు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఫారమ్‌ను పూర్తి చేసేందుకు ఓ నంబర్‌కు కాల్ చేయాలని లేదా వాట్సాప్ ద్వారా పంపిన లింక్‌లో వివరాలు నమోదు చేసి నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా రూ.5 చెల్లించాలని మోసగాళ్లు కోరుతున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా లాగిన్ వివరాలు, పాస్‌వర్డ్, సీవీవీ నంబర్, ఏటీఎం పిన్ వంటి బ్యాంకింగ్ సమాచారాన్ని కూడా అడుగుతున్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా లేదా తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఇలాంటి సందేశాలను పంపదని స్పష్టం చేశారు. ఈసీ, సీఈఓ పేరుతో వచ్చే అనుమానాస్పద సందేశాలు, ఫోన్‌కాల్స్‌పై ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాటికి స్పందించవద్దని, ఎలాంటి బ్యాంకింగ్ వివరాలను వెల్లడించవద్దని హెచ్చరించారు. ఇలాంటి సందేశాలు లేదా కాల్స్ వస్తే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు.

# హేట్ స్పీచ్‌పై కఠిన చర్యలు!

- భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలగకుండా సమతుల్య విధానం
- కులం, మతం, ప్రాంతం, భాష ఆధారంగా విద్వేష ప్రసంగాలపై నజర్
- ఫిర్యాదులు, ఆధారాల సేకరణ, బాధ్యత నిర్ధారణపై స్పష్టమైన మార్గదర్శకాలు
- సోషల్ మీడియా ద్వారా వేగంగా వ్యాప్తి చెందుతున్న హేట్ స్పీచ్‌పై ప్రత్యేక దృష్టి
- చట్టం ముందు అందరూ సమానమే.. రాజకీయాలకు అతీతంగా కమిటీ పనిచేయాలి
- హేట్ స్పీచ్ సెలెక్ట్ కమిటీ రెండో సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

కాకతీయ,తెలంగాణ బ్యూరో : భావప్రకటన స్వేచ్ఛకు ఎంతో ప్రాధాన్యం ఉందని, అదే సమయంలో ఒకరి స్వేచ్ఛ మరొకరి గౌరవం, భద్రత, సామాజిక సామరస్యానికి భంగం కలిగించకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని హేట్ స్పీచ్ సెలెక్ట్ కమిటీ చైర్మన్, మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కులం, మతం, ప్రాంతం, భాష, వర్గం లేదా ఇతర సామాజిక అంశాల ఆధారంగా ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు సమాజంలో ఉద్రిక్తతలకు దారితీయవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి ప్రసంగాలతో శాంతిభద్రతలకే కాకుండా సామాజిక ఐక్యతకు కూడా నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో హేట్ స్పీచ్ సెలెక్ట్ కమిటీ రెండో సమావేశం జరిగింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టపరమైన నిబంధనలు, వాటి అమలులో ఎదురవుతున్న సమస్యలు, పోలీసు, ఇతర అధికార యంత్రాంగం ఎదుర్కొంటున్న సవాళ్లను కమిటీ క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి సూచించారు. హేట్ స్పీచ్‌ను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల భావప్రకటన హక్కును గౌరవిస్తూనే ద్వేషాన్ని ప్రోత్సహించే, ప్రజల మధ్య విద్వేషాలను పెంచే చర్యలను నిరోధించే విధంగా సమతుల్యమైన విధానాన్ని రూపొందించాలని చెప్పారు.

## సోషల్ మీడియాలో వేగంగా వ్యాప్తి

సోషల్ మీడియా విస్తృతమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో హేట్ స్పీచ్ వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని పొన్నం ప్రభాకర్ అన్నారు. ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్యలు క్షణాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలకు చేరుతున్న నేపథ్యంలో ఇలాంటి ప్రసంగాల ప్రభావాన్ని కూడా కమిటీ పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కులం,మతం,ప్రాంతం, భాష,వర్గం వంటిఅంశాల ఆధారంగావిద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు సమాజంలో ఉద్రిక్తతలకు కారణమయ్యే అవకాశం ఉన్నందున వాటిపై తగిన విధానం అవసరమన్నారు. హేట్ స్పీచ్‌పై ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని ఎలా పరిశీలించాలి? ఆధారాలను ఏ విధంగా సేకరించాలి? బాధ్యతను ఎలా నిర్ధారించాలి? చట్టపరమైన చర్యలు ఏ విధంగా తీసుకోవాలి? అనే అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ అంశాలన్నింటినీ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు.

## ఫిర్యాదులపై స్పష్టమైన విధానం

హేట్ స్పీచ్‌కు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంలో స్పష్టత, పారదర్శకత ఉండాలని పొన్నం ప్రభాకర్ అన్నారు. చట్టపరమైన అంశాలతో పాటు క్షేత్రస్థాయిలో పోలీసు అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా పరిశీలించాలని చెప్పారు. ఫిర్యాదు అందిన వెంటనే వాస్తవాలను నిర్ధారించడం, సంబంధిత ఆధారాలను సేకరించడం, బాధ్యత వహించే వ్యక్తులను గుర్తించడం, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై సమగ్ర విధానం అవసరమన్నారు. అయితే హేట్ స్పీచ్ నియంత్రణ పేరుతో ప్రజల భావప్రకటన స్వేచ్ఛకు ఎలాంటి భంగం కలగకూడదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో భావప్రకటన హక్కు ఎంతో కీలకమని, అదే సమయంలో ఆ హక్కును ఉపయోగించి ఇతరుల గౌరవం, భద్రత, సామాజిక సామరస్యానికి భంగం కలిగించే పరిస్థితులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు.

## రాజకీయాలకు అతీతంగా కమిటీ

హేట్ స్పీచ్ సెలెక్ట్ కమిటీ రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ఏ పార్టీకి చెందిన వారైనా, ఏ వర్గానికి చెందిన వారైనా చట్టం ముందు సమానమే అన్న సూత్రాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. హేట్ స్పీచ్‌ను అరికట్టే పేరుతో ఒక వర్గాన్ని లేదా రాజకీయ పార్టీని లక్ష్యంగా చేసుకునే విధానం ఉండకూడదని, చట్టం అందరికీ సమానంగా వర్తించేలా చూడాలని చెప్పారు. కమిటీ అధ్యయనం చేసే అంశాల్లో ఈ సమతుల్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎవరి భావప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడం కమిటీ లక్ష్యం కాదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. ఒకరి స్వేచ్ఛ మరొకరి హక్కులకు భంగం కలిగించకుండా ఉండేలా చట్టపరమైన, పరిపాలనా చర్యలపై కమిటీ దృష్టి పెట్టాలని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మీ, మాణిక్‌రావు, అబ్దుల్ బలాల, శాసనసభ కార్యదర్శి తిరుపతి, హోంశాఖ సెక్రటరీ, లా సెక్రటరీతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో హేట్ స్పీచ్ నియంత్రణకు సంబంధించిన చట్టపరమైన అంశాలు, అమలు తీరుపై అధికారులు కమిటీకి వివరాలు అందించినట్లు సమాచారం.

# హామీల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలి

- ప్రభుత్వ హామీల కమిటీకి స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలి
- ఎన్నికల మేనిఫెస్టో హామీలను కమిటీ పరిధిలోకి తేవాలి
- అధికారులను పిలిచి వివరణ కోరే అధికారం కల్పించాలి
- క్రమం తప్పకుండా సమావేశాలు, స్టడీ టూర్లు నిర్వహించాలి
- బీఆర్ ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



కాకతీయ, హైదరాబాద్ : శాసన మండలి ప్రభుత్వ హామీల కమిటీ ప్రజల పక్షాన పని చేసేలా స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు కోరారు. గురువారం నిర్వహించిన కమిటీ ప్రారంభ సమావేశంలో పాల్గొన్న ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. కమిటీ పరిధిలోకి వచ్చే 'హామీలు' అంటే సభలో మంత్రులు ఇచ్చే హామీలకే పరిమితమా.. లేక ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రధాన హామీలు కూడా ఇందులోకి వస్తాయా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. మహిళలకు రూ.2,500 అందిస్తామన్న హామీ వంటి ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రధాన అంశాల అమలును కూడా కమిటీ పరిశీలించాలని రవీందర్‌రావు సూచించారు. పార్టీలకు అతీతంగా ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని హామీల అమలుపై నిలదీసేలా కమిటీకి తగిన అధికారాలు ఉండాలని అన్నారు. అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులను కమిటీ ముందు పిలిచి వివరణ కోరే వెసులుబాటు కల్పించాలని కోరారు.

## చైర్మన్‌కు అభినందనలు

శాసనమండలిని ప్రస్తుత భవనంలోకి మార్చి సభ్యుల గౌరవాన్ని పెంచిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి రవీందర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. చాలాకాలం తర్వాత కమిటీల ఏర్పాటు జరగడంపై హర్షం వ్యక్తం చేశారు. తదుపరి సమావేశం నాటికి కమిటీ అధికారాలు, విధివిధానాలపై పూర్తి స్పష్టత ఇవ్వాలని కోరారు. కమిటీ క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడంతో పాటు స్టడీ టూర్లు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలి వైస్‌చైర్మన్ బండా ప్రకాశ్, కమిటీ చైర్మన్ కేతావత్ శంకర్, అధికారులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా!

**ఆగస్టు 14న ట్యాంక్‌బండ్‌పై బీజేపీ భారీ తిరంగా యాత్ర**

**అంబేడ్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ**

**కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రముఖుల హాజరు**

**దేశభక్తి స్ఫూర్తితో తరలిరావాలి : డా. మేకల శిల్పారెడ్డి**

కాకతీయ, తెలంగాణ బ్యూరో : ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా–తిరంగా యాత్ర'లో భాగంగా ఆగస్టు 14న ట్యాంక్‌బండ్‌పై భారీ తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ తెలంగాణ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు, తిరంగా యాత్ర రాష్ట్ర కార్యనిర్వాహక కన్వీనర్ డా. మేకల శిల్పారెడ్డి తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కేవలం కార్యక్రమం కాదని, ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించే ఉద్యమమని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్ వద్ద తెలుగుతల్లి ఫ్లైఓవర్ సమీపంలోని డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు తిరంగా యాత్ర కొనసాగుతుందని శిల్పారెడ్డి తెలిపారు. ర్యాలీకి ముందు బీజేపీ ఎండోమెంట్ సెల్ ఆధ్వర్యంలో కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక



పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, కేంద్ర మంత్రులు పాల్గొంటారని తెలిపారు. ర్యాలీలో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్‌తో పాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. మాజీ సైనికులు, క్రీడాకారులు, పద్మ అవార్డు గ్రహీతలు, సినీ ప్రముఖులు, సామాజిక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని పేర్కొన్నారు.

## దేశభక్తిని చాటాలి

అమరవీరుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్ర్యం లభించిందని శిల్పారెడ్డి గుర్తుచేశారు. కులాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరినీ కలిపే శక్తి జాతీయ జెండా అని అన్నారు. ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 14న నిర్వహించే తిరంగా యాత్రకు బీజేపీ శ్రేణులతో పాటు తెలంగాణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

# కోల్డ్ స్టోరేజీల్లో 'జీరో దందా'పై ఉక్కుపాదం!

- ధరల వ్యత్యాసం.. ఆర్‌డీ అక్రమాలపై రాష్ట్రవ్యాప్త తనిఖీలు
- ఖమ్మం ఘటనతో ప్రభుత్వం అప్రమత్తం
- వరంగల్‌లో వెంకటసాయి కోల్డ్ స్టోరేజ్‌లో తనిఖీలు







కాకతీయ, వరంగల్ ప్రతినిధి: ఖమ్మం మార్కెట్‌లో ఇటీవల చోటుచేసుకున్న ఆర్‌డీ అనుమతి వ్యవహారం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కోల్డ్ స్టోరేజీల్లో జరుగుతున్న 'జీరో దందా', ధరల వ్యత్యాసం, ఆర్‌డీ పేరుతో జరిగే అక్రమ లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి కోల్డ్ స్టోరేజీల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా నుంచి వచ్చిన ప్రత్యేక బృందం గురువారం వరంగల్ మార్కెట్ పరిధిలోని కోల్డ్ స్టోరేజీల్లో తనిఖీలు నిర్వహించింది. కరీంనగర్ జిల్లా బోయినపల్లి మార్కెట్ కార్యదర్శి పి. రమణ, కోరుట్ల మార్కెట్ కార్యదర్శి ఎం. ప్రశాంత్, మానకొండూరు సెక్రటరీ ఎం. శ్రావణ్‌తో కూడిన ప్రత్యేక బృందం వరంగల్ మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, డీఎంఓ సురేఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టింది. తొలుత వెంకటసాయి కోల్డ్ స్టోరేజ్‌ను సందర్శించిన అధికారులు అక్కడి నిల్వలు, అమ్మకాలు, ప్రస్తుత స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

### కాంటా చీటీలు.. సీసీ ఫుటేజ్ సేకరణ

కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం నుంచి కాంటా చీటీలు, స్టాక్ లావాదేవీలకు సంబంధించిన రికార్డులను అధికారులు తీసుకున్నారు. గత నెల రోజుల సీసీ కెమెరా ఫుటేజ్‌ను కూడా పరిశీలన కోసం కోరారు. స్టాక్‌కు సంబంధించిన అన్ని లావాదేవీల వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కోల్డ్ స్టోరేజీలో రైతులకు చెందిన సరుకు ఎంత ఉంది? వ్యాపారులకు చెందిన సరుకు ఎంత ఉంది? ప్రస్తుతం ఎంత స్టాక్ ఉంది? ఎంత సరుకు విక్రయించారు? వంటి వివరాలు స్పష్టంగా నమోదు చేసి ఉంచాలని అధికారులు సూచించారు. ఇటీవల ఖమ్మం మార్కెట్‌లో ధరల్లో వ్యత్యాసం, ఆర్‌డీకి అనుమతి వంటి అంశాల నేపథ్యంలో వ్యాపారులు లావాదేవీలు నిలిపివేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఈ వ్యవహారం నేపథ్యంలో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్న సరుకు, విక్రయాల తీరుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కోల్డ్ స్టోరేజీల్లో సరుకు నిల్వలు, విక్రయాల్లో 'జీరో దందా', ఆర్‌డీ పేరుతో అక్రమ లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న తనిఖీల్లో రికార్డులు, స్టాక్ వివరాలు, కాంటా చీటీలు, సీసీ ఫుటేజ్ తదితరాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

### బయటపడనున్న అక్రమాలెన్ని?

కోల్డ్ స్టోరేజీల్లో రైతులు, వ్యాపారుల సరుకు నిల్వల మధ్య వ్యత్యాసాలు ఉన్నాయా? రికార్డుల్లో ఒక రకంగా.. క్షేత్రస్థాయిలో మరో రకంగా స్టాక్ చూపిస్తున్నారా? ఆర్‌డీ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు జరుగుతున్నాయా? అనే అంశాలపై అధికారులు దృష్టి సారించారు. ప్రత్యేక బృందాల తనిఖీల్లో ఇప్పటివరకు ఎలాంటి అక్రమాలు బయటపడ్డాయన్నది అధికారులు వెల్లడించాల్సి ఉంది. తనిఖీల అనంతరం రికార్డులు, స్టాక్ వివరాలను సరిపోల్చి అక్రమాలు గుర్తిస్తే సంబంధిత వ్యాపారులు, కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఖమ్మం ఘటనతో మొదలైన ఈ తనిఖీలు రాష్ట్రవ్యాప్తంగా 'జీరో దందా'పై ప్రభుత్వ నిఘా ఎంత మేరకు పనిచేస్తుందో తేల్చనున్నాయి.

## ప్రజా సమస్యలపై తక్షణ స్పందన ఉండాలి

- సమగ్ర భూగర్భ డ్రైనేజీకి 14వ డివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి
- 62 ఇంజినీరింగ్ పనులు మంజూరు.. 39 పూర్తి
- తాగునీరు, శానిటేషన్, వీధి దీపాల సమస్యలకు త్వరలో పరిష్కారం
- 14వ డివిజన్ సమస్యలపై ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కమిషనర్ టి.వెంకన్న సమీక్ష



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తక్షణమే స్పందించి సమన్వయంతో చర్యలు చేపట్టాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. గురువారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో బల్దియా కమిషనర్ టి.వెంకన్నతో కలిసి 14వ డివిజన్ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు శానిటేషన్, తాగునీరు, వీధి దీపాలు, శ్మశానవాటిక, విద్యుత్ తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. నగరంలో సమగ్ర భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీగా నిధులు కేటాయించారని ఎమ్మెల్యే తెలిపారు. అందులో సింహభాగం వర్ధన్నపేట నియోజకవర్గానికి, ముఖ్యంగా 14వ డివిజన్‌కు కేటాయించాలని కోరారు. వర్షాల సమయంలో ఇళ్లలోకి మురుగునీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను మానవీయ కోణంలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. 14వ డివిజన్‌లో 62 ఇంజినీరింగ్ పనులు మంజూరు కాగా, 39 పనులు పూర్తయ్యాయని కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. వీధి దీపాలు, శానిటేషన్ వాహనాల డ్రైవర్ల నియామకం, శ్మశానవాటిక సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. 2020–21 సర్వేలో జరిగిన తప్పుల కారణంగా నీటి సరఫరా లేకున్నా కొందరికి బిల్లులు వస్తున్న అంశాన్ని సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్‌ఈ రాజ్‌కుమార్, ఎంహెచ్‌ఓ డా. రాజేష్, డీఈలు, ఏఈలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలి
- పీఆర్సీని 2023 నుంచి అమలు చేయాలి
- సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి
- యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ నాయకులు డిమాండ్
- తహసీల్దార్‌కు ఉపాధ్యాయ సంఘాల వినతి

కాకతీయ, నెల్లికుదురు : విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూపీఎస్సీ భాగస్వామ్య సంఘాలైన యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నెల్లికుదురు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ నివేదిక తెప్పించుకుని 2023 నుంచి పీఆర్సీని అమలు చేయాలని కోరారు. కొత్త ఆరోగ్య పథకం అన్ని రకాల ఆసుపత్రుల్లో అమలయ్యేలా యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చించాలని సూచించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ కాంట్రాక్టు టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని, మోడల్ స్కూల్, ఎయిడెడ్ స్కూల్, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి 010 ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాల నుంచి రెండు నెలలుగా హెల్త్ కార్డు వాటా మినహాయిస్తున్నప్పటికీ విధివిధానాలు ప్రకటించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. చికిత్స అందించే ఆసుపత్రుల వివరాలను వెల్లడించి, అన్ని ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు.

### పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించాలి

పాఠశాలలను 27 వేల నుంచి 4 వేలకు తగ్గించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, జీవో నంబర్ 25ను సవరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కోట జనార్ధన్, యాదగిరి, దేవేందర్, లోకేందర్, వెంకటేశ్వర్లు, సంపత్‌రెడ్డి, మధుబాబు, రాజు, ప్రవీణ్, రవీందర్, రవి, నురోద్దీన్, రమేష్, విక్రమ్‌సింగ్, రాకేశ్, రాజన్న, భాస్కర్, దర్గయ్య, విజయ, సాగర్, సుమలత తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఏనుమాముల మార్కెట్‌లో ఏం జరుగుతోంది?

- విచారణ అధికారికమా.. మామూలుగానే సాగుతోందా?
- పెద్ద మార్కెట్‌లో చిన్నస్థాయి మార్కెట్ అధికారులు పరిశీలనా?
- రికార్డుల పరిశీలనపై వెల్లువెత్తుతున్న అనుమానాలు
- 2024-25, 2025-26 లావాదేవీలపై బృందం ఆరా
- పత్తి, మిర్చి, పసుపు, పల్లికాయ, మామిడి కొనుగోళ్లపైనా ఆరోపణలు
- విజిలెన్స్ కాకుండా మార్కెట్ ఉద్యోగులతోనే తనిఖీలు ఎందుకు?



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ మార్కెట్లకు చెందిన కొందరు ఉద్యోగులతో కూడిన బృందం ఏనుమాముల మార్కెట్‌లో పలు రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. గత ఏడాది మార్కెట్‌లో జరిగిన వివిధ సరుకుల లావాదేవీలకు సంబంధించిన వివరాలపై ఈ బృందం ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ పరిశీలన అసలు ఉద్దేశం ఏమిటన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అక్రమాలను వెలికితీసేందుకు అధికారికంగా విచారణ చేపట్టారా? లేక ఇతర మార్కెట్ల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చే ప్రక్రియలో భాగంగా రికార్డులను పరిశీలిస్తున్నారా? అన్నదానిపై స్పష్టత లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### పాత ఆరోపణల నేపథ్యంలో తాజా పరిశీలన

ఏనుమాముల మార్కెట్‌లో అనేక అక్రమాలు జరుగుతున్నాయంటూ చాలాకాలంగా ఆరోపణలు ఉన్నాయి. గతంలో మార్కెట్‌లో పనిచేసిన కొందరు ఉన్నతస్థాయి ఉద్యోగులు సస్పెన్షన్‌కు కూడా గురయ్యారు. పత్తి కొనుగోళ్లు, సాగు విస్తీర్ణంలో వ్యత్యాసాలు వెలుగులోకి రావడంతో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు అప్పట్లో చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో తాజాగా మార్కెట్ రికార్డుల పరిశీలనకు రాష్ట్రంలోని ఇతర మార్కెట్ల ఉద్యోగులతో బృందాన్ని ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కోదాడ మార్కెట్ కార్యదర్శి కాజా మోహియుద్దీన్, కరీంనగర్ మార్కెట్ సెక్రటరీ మహమ్మద్ హమీర్, జగిత్యాల జిల్లా గొల్లపల్లి మార్కెట్ కార్యదర్శి సతీష్ కుమార్, హనుమకొండ జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చందర్‌లతో కూడిన బృందాన్ని ఎంపిక చేసినట్లు తెలిసింది. 2024–25, 2025–26 మార్చి నాటికి జరిగిన లావాదేవీలను పరిశీలించాలని మార్కెటింగ్ శాఖ నిర్ణయించినట్లు సమాచారం.

### ఒకరోజు రికార్డులతో అక్రమాలు బయటపడేనా?

తాజాగా నాలుగైదు రోజులుగా మార్కెట్‌లోని లావాదేవీలను బృందం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. పత్తి, మిర్చి, పసుపు, పల్లికాయ, మామిడి తదితర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ పరిశీలనలో భాగంగా కేవలం ఒకరోజు రికార్డులను మాత్రమే పరిశీలిస్తున్నట్లు తెలుస్తుండటంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. గతంలో జరిగిన లావాదేవీల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు ఉన్నప్పుడు పరిమిత రికార్డులను పరిశీలించడం ద్వారా పూర్తి వాస్తవాలు వెలుగులోకి వస్తాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మార్కెట్‌లోనే కాకుండా సంబంధిత వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, రైతుల నుంచి వివరాలు సేకరించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. లావాదేవీల రికార్డులతో పాటు వాస్తవంగా జరిగిన కొనుగోళ్లు, సరుకు రాక, బరువులు, ధరలు, చెల్లింపులు తదితర అంశాలను సరిపోల్చితేనే పూర్తి చిత్రం బయటపడుతుందని అభిప్రాయపడుతున్నారు.

### 'మార్కెట్ ఉద్యోగులే.. మార్కెట్ ఉద్యోగులపైనేనా?'

రికార్డులను పరిశీలిస్తున్న బృందంలోనూ మార్కెట్ శాఖకు చెందిన ఉద్యోగులే ఉండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఏనుమాముల వంటి రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్లలో ఒకటైన చోట ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో.. అదే శాఖకు చెందిన ఇతర మార్కెట్ల ఉద్యోగులతో పరిశీలన చేయించడం ఎంతవరకు సమర్థవంతమన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. 'నీది తెలంగాణే.. నాది తెలంగాణే' అన్న చందంగా పరస్పరం ఉద్యోగులే రికార్డులను పరిశీలిస్తే అక్రమాలు పూర్తిస్థాయిలో బయటపడే అవకాశం ఉందా? అన్న సందేహాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడైనా లోపాలు, అక్రమాలు గుర్తించినా వాటి తీవ్రతను తగ్గించి చూపించే అవకాశం లేకపోలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

### విజిలెన్స్ విభాగం ఏం చేస్తున్నట్టు?

సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అక్రమాలు, అవకతవకలపై తీవ్ర ఆరోపణలు వచ్చినప్పుడు విజిలెన్స్ విభాగం రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టడం ఆనవాయితీ. రికార్డులు, లావాదేవీలు, అధికారుల వ్యవహారశైలిపై స్వతంత్రంగా విచారణ చేపట్టే అవకాశం విజిలెన్స్‌కు ఉంటుంది. అలాంటప్పుడు ఏనుమాముల మార్కెట్‌లో నూ ఆరోపణలు ఉన్నప్పటికీ మార్కెట్ శాఖకు చెందిన ఉద్యోగులతోనే రికార్డుల పరిశీలన చేయించడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిజంగానే మార్కెట్‌లో జరిగిన అక్రమాలను వెలికితీయడమే లక్ష్యమైతే విజిలెన్స్ విభాగంతో సమగ్ర తనిఖీలు ఎందుకు చేపట్టడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. స్వతంత్ర సంస్థతో విచారణ జరిపితే రికార్డుల్లో ఉన్న వ్యత్యాసాలు, వాస్తవలావాదేవీలు, నిబంధనల ఉల్లంఘనలుస్పష్టంగా బయటపడే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

### విచారణా.. శిక్షణా?

తాజా పరిశీలనపై మార్కెటింగ్ శాఖ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇది అధికారిక విచారణ అయితే ఏ అంశాలపై విచారణ చేపడుతున్నారు? ఏఏ సంవత్సరాల రికార్డులను పరిశీలిస్తున్నారు? ఎంతకాలం లావాదేవీలను తనిఖీ చేస్తున్నారు? ఇప్పటివరకు ఏమైనా అక్రమాలు గుర్తించారా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంది. అదే సమయంలో ఇతర మార్కెట్ల ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడంలో భాగంగా రికార్డులను పరిశీలిస్తున్నట్లయితే ఆ విషయాన్ని కూడా స్పష్టం చేయాలని పలువురు కోరుతున్నారు. ఎందుకంటే ఏనుమాముల మార్కెట్‌లో గతంలో పత్తి కొనుగోళ్లు, సాగు విస్తీర్ణం తదితర అంశాలపై ఆరోపణలు, చర్యలు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న పరిశీలనపై సహజంగానే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా ఏనుమాముల మార్కెట్‌లో ప్రస్తుతం జరుగుతున్న రికార్డుల పరిశీలన అసలు ఏ ఉద్దేశంతో జరుగుతోంది? అక్రమాలను వెలికితీయడానికా? లేక సాధారణ ప్రక్రియలో భాగంగానా? అన్నదానిపై మార్కెటింగ్ శాఖ స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఆరోపణలు నిజమైతే సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే అనవసర అనుమానాలకు తావులేకుండా పరిశీలన ఉద్దేశాన్ని బహిర్గతం చేయాలని రైతులు, వ్యాపార వర్గాలు కోరుతున్నాయి.

## బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డు సాధించిన హరీష్‌కు సన్మానం



కాకతీయ, హన్మకొండ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీలో 'బెస్ట్ అచీవ్‌మెంట్ అవార్డు'కు ఎంపికైన గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యుడు, ఆంధ్రజ్యోతి దినపత్రిక డిప్యూటీ చీఫ్ ఫొటోగ్రాఫర్ వీరగోని హరీష్‌ను గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ కమిటీ సన్మానించింది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆధ్వర్యంలో హరీష్‌కు శాలువా కప్పి, మెమొంటో అందజేశారు. ఇప్పటికే పలు అవార్డులు అందుకున్న హరీష్ భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబరిచి మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొళ్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యాం కుమార్, బొడిగె శ్రీను, అల్లం రాజేష్‌వర్మ, యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు సంపేట సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, పోడిచెట్టి విష్ణువర్ధన్ పాల్గొన్నారు. కార్యవర్గ సభ్యులు జనగాని ఆంజనేయులు, ఎండి నయీమ్ పాషా, కమటం వేణుగోపాల్, నన్నపనేని భరత్‌కుమార్, మంచాల రాజు, బలువారి విజయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీకి ట్రంప్ ఫోబియా!

- తప్పు చేయకపోతే జంకు ఎందుకు?
- కమ్యూనిస్టులతోనే దేశంలో మార్పు తథ్యం
- ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- హామీలు అమలు చేయకుంటే ఆందోళన
- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు
- ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం
- సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా



కాకతీయ, ఖమ్మం టౌన్ : ప్రధాని నరేంద్రమోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోబియా పట్టుకుందని, 145 కోట్ల జనాభా ఉన్న దేశానికి ప్రధానిగా ఉన్న ఆయన పిరికివాడిగా మారి పోయారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తీవ్రంగా విమర్శించారు. తప్పు చేయనప్పుడు పార్లమెంట్‌కు రావడానికి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. దేశంలో ప్రజలు అనుభవిస్తున్న హక్కులు, సంక్షేమ పథకాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనని, రానున్న రోజుల్లో దేశంలో మార్పు కూడా కమ్యూనిస్టుల పోరాటాలతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ఎన్నికలతో సంబంధం లేకుండా నిరంతరం పోరాడతామని, ఒకటి రెండు సీట్ల కోసం ప్రజా ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. సీపీఐ జన చైతన్య యాత్రల ముగింపు సందర్భంగా గురువారం ఖమ్మం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. జడ్పీ సెంటర్ నుంచి పాత బస్టాండ్, మయూరి సెంటర్ మీదుగా భక్తరామదాసు కళాక్షేత్రం వరకు సాగిన ప్రదర్శనలో వందలాది మంది పార్టీ కార్యకర్తలు, కళాకారులు పాల్గొన్నారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడారు.

### ప్రజల హక్కులు పోరాటాల ఫలితమే : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజలు అనుభవిస్తున్న హక్కులు, సంక్షేమ పథకాలు కమ్యూనిస్టులు సాగించిన ఉద్యమాల ఫలితంగానే వచ్చాయని కూనంనేని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికలు పూర్తిగా ఆర్థిక వ్యవహారంగా మారి పోయాయని, కోట్ల రూపాయలు ఖర్చు చేసే వారే గెలిచే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులు ఎక్కువ సీట్లు గెలవకపోవచ్చు కానీ.. దేశ రాజకీయాలను ప్రభావితం చేసే, గెలు పోటములను శాసించే శక్తి కమ్యూనిస్టులకు ఉందన్నారు. మోదీ, అమిత్‌షాలు తప్పు చేశామనే భావనతోనే పార్లమెంట్‌కు వచ్చేందుకు జంకుతున్నారని ఆరోపించారు. మోదీ పాలనకు తిరోగమనం ప్రారంభమైందని, అన్ని వర్గాల ప్రజలు కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పరిణామంతో మోదీ అహంకారం దిగిపోయిందని వ్యాఖ్యానించారు. యువతలో ఉద్యమ స్ఫూర్తి పెరుగుతోందని, బీజేపీ అధికారం కోల్పోవడమే ఇక మిగిలిందని అన్నారు. కమ్యూనిస్టులు ప్రపంచవ్యాప్తంగా పురోగమిస్తున్నారని, అందుకే అక్కడ ట్రంప్, ఇక్కడ మోదీ ఆందోళన చెందుతున్నారని కూనంనేని వ్యాఖ్యానించారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న బీజేపీ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. బీజేపీ, దాని అనుబంధ సంస్థలు దేశంపై దోపిడీ దండుగా పడ్డాయని ఆరోపిస్తూ.. ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించి వాటిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

### ప్రజాగ్రహానికి గురికాక తప్పదు :సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

తెలంగాణలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ఆరోపించారు. సన్నబియ్యం, ఉచిత బస్సు మినహా మిగిలిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. అప్పులున్నాయనే పేరుతో హామీలను వాయిదా వేస్తే ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో వ్యవహరించిన తీరులోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో రాజకీయ వివక్ష చూపుతోందని ఆరోపించారు. పార్టీ జెండా కప్పుకుంటేనే ఇళ్లు కేటాయిస్తామన్న ధోరణి సరికాదన్నారు. సీతారామ ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు రాష్ట్రంలో ఎన్నికల హామీల అమలు పైనా సీపీఐ నిరంతర పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రశ్నిస్తూనే ఉంటామని కూనంనేని సాంబశివరావు తెలిపారు. గెలుపోటములు ఎన్నికల వరకే పరిమితమని, ప్రజా సమస్యల విషయంలో మాత్రం ఎలాంటి రాజీ ఉండదన్నారు. ఖమ్మం జిల్లాలో ఈసారి పోటీ తథ్యమని ప్రకటించారు. సభలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు ప్రసంగించారు. జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ఆహ్వానితులను వేదికపైకి ఆహ్వానించారు. సీపీఐ నగర కార్యదర్శి షేక్ జానీమియా, రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, అజ్మీరా రామమూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు సతీష్ బృందం ఆలపించిన గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.

# సీతారామ పనుల్లో వేగం పెంచాలి

- పెండింగ్ పనులు పూర్తి చేసి సాగునీరందించాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరిన మంత్రి తుమ్మల
- సాగర్ ఆయకట్టుకు రెండు మూడు రోజుల్లో నీరు
- 532 ఎకరాల భూసేకరణ వేగవంతం.. జూలూరుపాడు టన్నెల్ పనులకూ ప్రాధాన్యం
- రూ.45 కోట్లతో భూసేకరణ.. ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ ప్రతిపాదన



కాకతీయ, ఖమ్మం : సీతారామ ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేసి రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతి, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి అవసరాలపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో గురువారం ఆయన సమావేశమయ్యారు. మూడో పంప్‌హౌస్ నుంచి నాలుగో పంప్‌హౌస్ వరకు అవసరమైన భూసేకరణను త్వరగా పూర్తిచేయడంతో పాటు జూలూరుపాడు టన్నెల్ పనులను వేగవంతం చేయాలని కోరారు. ప్రస్తుతం సాగర్ ఆయకట్టులో పంటలను కాపాడేందుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా మరోసారి నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

### రూ.45 కోట్లతో 532 ఎకరాల భూసేకరణ

ములకలపల్లి మండలం కమలాపురంలోని మూడో పంప్‌హౌస్ నుంచి దమ్మపేట మండలంలోని నాలుగో పంప్‌హౌస్ వరకు నీటిని తరలించేందుకు 532 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందని తుమ్మల తెలిపారు. ఇందుకోసం రూ.45 కోట్లతో భూసేకరణ ప్రక్రియ చేపట్టినట్లు చెప్పారు. దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల పరిధిలో భూసేకరణ పూర్తయితే ఆయా ప్రాంతాలకు గోదావరి జలాలను అందించే అవకాశం ఉంటుందన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సుమారు 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో ఆయకట్టు రైతులకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. భూసేకరణ, పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. మూడో పంప్‌హౌస్ నుంచి నాలుగో పంప్‌హౌస్ వరకు కాలువ ద్వారా నీటిని తరలించే ప్రతిపాదనలు ఉన్నాయని తుమ్మల వివరించారు. అయితే నాలుగో పంప్‌హౌస్ నుంచి దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని చెరువులకు కాలువలకు బదులుగా పైప్‌లైన్ ద్వారా నీటిని అందించే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. పైప్‌లైన్ పనులకు అవసరమైన అంచనాలు రూపొందించి నిధులు విడుదల చేస్తే భూసేకరణ వ్యయం తగ్గడంతో పాటు రైతులు భూములు కోల్పోయే పరిస్థితి ఉండదన్నారు.

### సాగర్ ఆయకట్టుకు మరోసారి నీరు

జూలూరుపాడు టన్నెల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు జలాశయానికి నీటిని అందించాలని తుమ్మల కోరారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇటీవల సాగర్ ఆయకట్టు పరిధిలోని వైరా, లంకసాగర్ ప్రాంతాలకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు ఇలాగే కొనసాగితే పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని, రైతుల పంటలను కాపాడేందుకు మరోసారి సాగునీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మల విజ్ఞప్తిపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. రెండు, మూడు రోజుల్లో సాగర్ ఆయకట్టు పంటలకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, పైప్‌లైన్, టన్నెల్ తదితర పనులను వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తుమ్మల తెలిపారు.25

# ఓట్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలి

- 73 లక్షల ఓట్ల తొలగింపు చిన్న విషయం కాదు
- 64 లక్షల ఓట్లను 'అనామలీ'గా గుర్తించడం ప్రమాదకరం
- అర్హులైన ప్రతి ఓటరుకు తిరిగి ఓటు హక్కు కల్పించేలా చూడాలి
- కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్
- చిన్న నిర్లక్ష్యాన్ని కూడా సహించం.. పనిచేయని బీఎల్ఏలపై చర్యలు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భారీగా ఓట్లు తొలగించడం, అనామలీ ఓట్లుగా గుర్తించడాన్ని కాంగ్రెస్ పార్టీ అత్యంత తీవ్రంగా పరిగణించాలని ఆ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. 73 లక్షల ఓట్లను తొలగించడం, 64 లక్షల ఓట్లను అనామలీగా గుర్తించడం కలిపి కోటి 30 లక్షలకు పైగా ఓట్ల వ్యవహారం ఉందని, ఇంత పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపు దేశంలోని మరే రాష్ట్రంలోనూ జరగలేదని ఆమె పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, భవిష్యత్ ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆమె పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, బూత్ లెవల్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ఓట్ల తొలగింపు కుట్ర రాజకీయాలు అత్యంత ప్రమాదకరమని, దీనిపై పార్టీ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు తమ పరిధిలో ప్రతి ఓటును పరిశీలించాలని, తొలగించిన ఓట్లలో అర్హులైన ఓటర్లను గుర్తించి వారు తిరిగి ఓటు హక్కు పొందేలా చూడాలని చెప్పారు. అనామలీగా గుర్తించిన ఓట్లను కూడా క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులు ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు.

### ప్రతి ఓటును పరిశీలించాలి

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎక్కడా చిన్నపాటి నిర్లక్ష్యానికి కూడా తావివ్వకూడదని మీనాక్షి నటరాజన్ అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రక్రియ భవిష్యత్‌లో జరిగే ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను నిర్ణయిస్తుందని, అందువల్ల ఇప్పుడు జరిగే ప్రతి తప్పిదం తర్వాత తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ రోజు నుంచే ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ వార్డుల వారీగా బీఎల్ఏలు ప్రతి ఓటును పరిశీలించాలని, డిజిటల్ వివరాలతో పాటు అనామలీగా గుర్తించిన ఓట్లను కూడా నిశితంగా పరిశీలించాలని చెప్పారు. ఓటర్ల జాబితాలో అర్హులైన వారి పేర్లు ఉండేలా చూడటంతో పాటు అనర్హులైన ఓట్లను గుర్తించడంలోనూ బీఎల్ఏలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ విషయంలో పనిచేయని వారిని కొనసాగించాల్సిన అవసరం లేదని, చురుగ్గా పనిచేసే వారిని నియమించుకోవాలని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పార్టీ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు. ఎక్కడ చిన్న నిర్లక్ష్యం జరిగినా సహించేది లేదని, పనిచేయని కోఆర్డినేటర్లు, బీఎల్ఏలను వెంటనే తొలగించి చైతన్యవంతంగా పనిచేసే వారిని నియమించాలని ఆదేశించారు. ఇన్‌చార్జి మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా విషయంలో పార్టీ నాయకులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, క్షేత్రస్థాయిలో బీఎల్ఏలకు అవసరమైన సహకారం అందించాలని చెప్పారు. పార్టీ నాయకుల నిర్లక్ష్యం భవిష్యత్‌లో ప్రమాదకర పరిస్థితులకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి స్థాయిలో బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

# రాయపాటి రవి మృతికి ప్రముఖుల నివాళి

కాకతీయ, కారేపల్లి : సింగరేణి మండలం కోమట్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన రాయపాటి రవి గురువారం ఉదయం 10.30 గంటలకు గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాయపాటి రవి పార్థివదేహాన్ని గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కోమట్లగూడెం సర్పంచ్ జయసుధ, కొమ్ముగూడెం సర్పంచ్ కల్తి భద్రయ్య, మాజీ సొసైటీ డైరెక్టర్ కడప పుల్లారావు తదితరులు రవి పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో హోటల్ రామ్మూర్తి, వేముల రామ్మూర్తి, ఉపేందర్, కాపు చంద్రం, కాపు ప్రభాకర్, కాపు సుధాకర్, వెంకన్న, రాంబాబు, పేనక వెంకన్న, కర్పాటి సీతారాములు, కోడెం సత్యం, సింగు, భద్రం సార్, సత్యం సార్తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెన్షన్లు, కల్యాణలక్ష్మిపై ప్రభుత్వ నిర్లక్ష్యం



- వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లు వెంటనే ఇవ్వాలి
- ఆడబిడ్డలకు రూ.2,500 హామీ ఏమైంది?
- కేసీఆర్ పథకాలను కొనసాగించలేకపోతున్నారు
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ప్రజల్లోకి వెళ్లాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి

కాకతీయ, జగిత్యాల : వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లతో పాటు మహిళలకు ఇస్తామన్న రూ.2,500 హామీని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఆసరా పెన్షన్‌ను గతంలో రూ.200 నుంచి రూ.2 వేలకు పెంచిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 32 నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా పరిషత్ తొలి మాజీ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ఏడు రకాల పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ అందులో వృద్ధాప్య, బీడీ కార్మికుల పెన్షన్లకు ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. ఎన్నికల సమయంలో రూ.2 వేలుగా ఉన్న పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని, మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేసీఆర్ బీడీ కార్మికుల సమస్యలను గుర్తించి దేశంలో ఎక్కడా లేని విధంగా వారికి రూ.2 వేల పెన్షన్ అందించారని జీవన్‌రెడ్డి తెలిపారు. పీఎఫ్ చెల్లింపుల నిబంధనల ప్రకారం 52 ఏళ్ల తర్వాత ప్రయోజనాలు వచ్చే బీడీ కార్మికులకు అండగా నిలిచేందుకు ఈ పథకాన్ని అమలు చేశారన్నారు. ఉత్తర తెలంగాణలో బీడీపరిశ్రమ మహిళలకుపెద్దఎత్తున ఉపాధికల్పిస్తోందని, అలాంటి కార్మికులసంక్షేమాన్నిప్రభుత్వంవిస్మరించడంసరికాదన్నారు.

### కల్యాణలక్ష్మిని ఆపడం సిగ్గుచేటు

పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచేందుకు కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలను అమలు చేసిందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. తొలుత రూ.50 వేలుగా ఉన్న ఆర్థిక సహాయాన్ని రూ.లక్షకు పెంచారని తెలిపారు. కుల, మతాలకు అతీతంగా పథకాన్ని అమలు చేశారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి కింద అదనంగా తులం బంగారం ఇస్తామని, మహిళలకు రూ.2,500 అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు వాటిని విస్మరించిందని ఆరోపించారు. దశాబ్దకాలంగా అమలవుతున్న కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలు నిలిచిపోయే పరిస్థితి రావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పథకాల అమలుపై న్యాయపరమైన సమస్యలు తలెత్తినప్పుడు ప్రభుత్వం కనీసం కోర్టులో కౌంటర్ పిటిషన్ కూడా దాఖలు చేయకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కేసును నీరుగార్చిందని ఆరోపించారు.

### హామీలను వెంటనే అమలు చేయాలి

వృద్ధుల సంరక్షణకు చట్టాలు చేసిన ప్రభుత్వం వారి సంక్షేమాన్ని విస్మరించడం సరికాదని జీవన్‌రెడ్డి అన్నారు. వృద్ధాప్య పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న అవ్వలు, తాతలకు ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులు, మహిళలకు పెన్షన్లు అందించకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ''తోబుట్టువు.. ఆడబిడ్డ.. కన్నతల్లి లాంటి మహిళలకు పెన్షన్ ఇవ్వకుండా వారి ఉసురు ఎందుకు పోసుకుంటున్నారు?'' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ప్రభుత్వ పనితీరుకు చెంపపెట్టు వంటివని వ్యాఖ్యానించారు. మహిళల విషయంలో ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతోందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన వృద్ధాప్య పెన్షన్, బీడీ కార్మికుల పెన్షన్, కల్యాణలక్ష్మి , షాదీముబారక్ వంటి పథకాలను కొనసాగించలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరుగుతుందనే కారణంతో సంక్షేమ పథకాలను తగ్గించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రికి నైతికత ఉంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధాప్య పెన్షన్, బీడీ కార్మికుల పెన్షన్, మహిళలకు ఇస్తామన్న రూ.2,500ను తక్షణమే అమలు చేయాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో శీలం ప్రవీణ్‌కుమార్, వోలమ్ మల్లేశం, గాజుల రాజేందర్, మున్నా, కళ్లేపల్లె దుర్గయ్య, కోరుకంటి రాము, తోట హరీష్, సతీష్‌కుమార్, పల్లె రవి, రాధాకిషన్, గంగా రెడ్డి, పొనగంటి మహేష్, రమేష్‌బాబు, బర్కం మల్లేశం, నరేష్‌గౌడ్, కచ్చు హరీష్, సాయి, మహేష్, గుండా మధు, మధు, అనిల్, రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విజయ డైరీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

- రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యం
- పాడి రైతులను ప్రోత్సహించాలి
- ఆధునిక పశుపోషణపై అవగాహన కల్పించాలి
- నాణ్యమైన పాల ఉత్పత్తుల తయారీకి మౌలిక వసతులు
- హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



కాకతీయ, హనుమకొండ : విజయ డైరీని పునరుద్ధరించి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు త్వరలో చర్యలు చేపడతామని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. పాడి రైతులను ప్రోత్సహించి పాల సేకరణను పెంచడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను అందించడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గురువారం విజయ డైరీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ పాల సేకరణ కేంద్రం, శీతలీకరణ కేంద్రం, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, పాల నాణ్యత పరీక్షించే ప్రయోగశాలను పరిశీలించారు. పాడి రైతుల సంక్షేమ సంఘం సభ్యులు, రైతులు, బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పశుపోషణ ద్వారా వ్యవసాయంతో పాటు నిరంతర ఆదాయం పొందవచ్చన్నారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన పశువులను ఎంపిక చేసుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విజయ డైరీని పశుసంవర్ధక శాఖతో అనుసంధానం చేసి ఆధునిక పశుపోషణ పద్ధతులు, పశువైద్య సేవలు, పాల ఉత్పత్తి పెంపుపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

### రోజుకు 15 వేల లీటర్ల లక్ష్యం

ప్రస్తుతం రోజుకు సుమారు 6 వేల లీటర్ల పాలను ప్రాసెసింగ్ చేస్తున్నామని విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ ధనరాజ్ తెలిపారు. 26 సొసైటీల ద్వారా పాలను సేకరిస్తున్నామని, పాలతో పాటు ఇతర ఉత్పత్తులను తయారు చేసి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు వివరించారు. పాల సేకరణ తగ్గడంతో ఉత్పత్తి సామర్థ్యం కూడా తగ్గిందని తెలిపారు. రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యాన్ని చేరుకునేలా పాడి రైతులను ప్రోత్సహించేందుకు కార్యాచరణ చేపడుతున్నట్లు చెప్పారు. విజయ డైరీ ద్వారా ప్రజలకు మరింత నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను అందించాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి రసాయనాలు కలపకుండా పాలను అందిస్తున్న సిబ్బంది కృషిని అభినందించారు. నెయ్యి, పన్నీరు తదితర పాల ఉత్పత్తులను విస్తృతంగా తయారు చేసేందుకు ఆధునిక యంత్రాలు, అవసరమైన మౌలిక వసతులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో విజయ డైరీ సొసైటీ చైర్మన్ ఎరుపు దేవేందర్, కమిటీ సభ్యులు సమ్మయ్య, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ చైతన్య, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సత్యసాయి, పాడి రైతులు, డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

# పారిశుధ్యం, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### ప్రజా సమస్యలపై అధికారుల స్పందన అభినందనీయం : పగడాల నాగరాజు



కాకతీయ, ఖమ్మం: బీఆర్ఎస్ ఆధ్వర్యం లో ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ కార్యాలయ ముట్టడి అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో పారిశుధ్యం, పౌర సేవలపై దృష్టి సారించడం అభినందనీయమని టీఆర్ఎస్ నాయకుడు పగడాల నాగరాజు అన్నారు. కమిషనర్ స్వయంగా డివిజన్లలో పర్యటించి ప్రజా సమస్యలను పరిశీలించడం స్వాగతించదగ్గ పరిణామమన్నారు. నగరంలో పేరుకుపోయిన చెత్త, మురుగుకాల్వలు, నిల్వ నీటి ప్రాంతాలను గుర్తించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. దోమల నివారణకు మందుల పిచికారీ, ఫాగింగ్ క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్యశాఖ ముందస్తు చర్యలు తీసుకుని అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందనను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి టీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని నాగరాజు తెలిపారు.

## పరకాల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం..

- ఎమ్మెల్యే రేవూరి హయాంలోనే పరకాల అభివృద్ధి..
- ముఖ్యమంత్రి సభకు యువత తరలి రావాలి..
- పరకాల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మదాసి శ్రీధర్



కాకతీయ,ఆత్మకూరు : వెనుకబాటుకు గురైన పరకాల నియోజకవర్గం ఆదర్శంగా అభివృద్ధి చేసేందుకు కోట్లాది రూపాయలతో నిర్మాణం చేసిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి యువత ఘన స్వాగతం పలకాలని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాదాసి శ్రీధర్ అన్నారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16న పరకాల నియోజకవర్గనికి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవనికి వస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు యూవత తరలి రావాలని కోరారు. ప్రభుత్వ అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే సభను విజయవంతం చేసేందుకు యూవజన కాంగ్రెస్ నాయకులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని సభను విజయవంతం చేసేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మండల కిసాన్ సెల్ అధ్యక్షులు రేవూరి జయపాల్ రెడ్డి,వార్డు సభ్యులు బయ్యా కుమారస్వామి,ఏఎంసి డైరెక్టర్ కాడబోయిన రమేష్, నియోజకవర్గ బీసీ సెల్ కోఆర్డినేటర్ చిమ్మని దేవరాజు, గ్రామ అధ్యక్షులు తాళ్ల కిరణ్, ఎలగొండ లింగమూర్తి,మాజీ సభ్యులు కాడబోయిన రవి, యూత్ నాయకులు కాడబోయిన రాజకుమార్, మహమ్మద్ కరీం, షరీఫ్, కాంగ్రెస్ నాయకులు తిరుపతి,మొగిలి,బయ్యా సురేష్,ఎలగొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల పేరుతో సైబర్ మోసాలు



- అధికారి పేరుతో ఫోన్లు.. ఫోన్‌పే ద్వారా నగదు బదిలీలు
- తెలంగాణ, ఏపీలో 28కు పైగా కేసులు.. రూ.15 లక్షల వరకు మోసాలు
- ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన చందుర్తి పోలీసులు
- నిందితుల నుంచి నగదు, ఫోన్లు, సిమ్ కార్డుల స్వాధీనం

కాకతీయ, చందుర్తి : పోలీసుల పేరుతో అమాయకులను నమ్మించి సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ జిల్లా నిందితులను చందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.18 వేల నగదు, మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లో వీరిపై 28కు పైగా కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మోతే మండలానికి చెందిన కిలుకాని సాయిచంద్ (30), సూర్యాపేటకు చెందిన కట్కూరి శరత్‌కుమార్ (31) ప్రస్తుతం హైదరా బాద్ మీర్‌పేట్‌లో నివాసం ఉంటున్నారు. గూగుల్, టెలిగ్రామ్ ద్వారా మీ–సేవ, మనీ ట్రాన్స్‌ఫర్ కేంద్రాల ఫోన్ నంబర్లు సేకరించి పోలీసు అధికారుల పేరుతో బాధితులకు ఫోన్లు చేసేవారు. తమను చందుర్తి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డిగా పరిచయం చేసుకుని, ఆస్పత్రి ఖర్చుల కోసం అత్యవసరంగా డబ్బులు కావాలని నమ్మించేవారు. అనంతరం ముందుగానే మాట్లాడుకున్న పెట్రోల్ బంక్ సిబ్బంది నంబర్‌కు ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేయించుకుని, అక్కడి నుంచి నగదును తీసుకునేవారు. ఇదే తరహాలో చందుర్తి మండలానికి చెందిన చిలుక పెంటయ్యకు ఫోన్ చేసి, తన కుమారుడు హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పి రూ.70 వేలు పంపించుకున్నారు. అనంతరం ఫోన్లు స్విచ్చాఫ్ చేయడంతో మోసపోయినట్లు గుర్తించిన పెంటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకున్నారు. బాధితుల నుంచి సుమారు రూ.15 లక్షల వరకు మోసాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన చందుర్తి సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది అనిల్, గంగారెడ్డిలను డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

## మండల వ్యవసాయ అధికారిగా యాస్మిన్



కాకతీయ, ఇనుగుర్తి: ఇనుగుర్తి మండల వ్యవసాయ అధికారిగా షేక్ యాస్మిన్ గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇనుగుర్తి మండల వ్యవసాయ అధికారిక పనిచేసిన భూక్య మహేందర్ నెల్లికుదురు మండల వ్యవసాయ అధికారిగా డిప్యూటేషన్ పై వెళ్లడంతో నెల్లికుదురు మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించిన ఈమె డిప్యూటేషన్ పై ఇనుగుర్తి మండలానికి వచ్చారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి ప్రభుత్వం ప్రవేశపెట్టి లాభ సహాయ వ్యవసాయ పద్ధతుల కోసం నూతన పద్ధతులను రైతులకు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్టిలైజర్ షాపు యజమానులు,సర్పంచ్, వివిధ పార్టీల రాజకీయ నాయకులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి,శాలువాతో సత్కరించారు.

## బాలికపై లైంగిక దాడి.. నిందితుడు రిమాండ్

### ఆటో డ్రైవర్ విజయ్‌కుమార్ అరెస్ట్



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : మట్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై సంగాల విజయ్‌కుమార్ అనే ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితురాలికి అనారో గ్యం రావడంతో తల్లి ఆరా తీయగా ఘటన వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించగా అనుమానాలు నిర్ధారణ కావడంతో ఆమె తల్లి మట్వాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వాహన తనిఖీల సందర్భంగా పారిపోయేందుకు ప్రయత్నించిన విజయ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు నేరం అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నేరానికి ఉపయోగించిన పల్సర్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం నిందితుడిని 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. బీఎన్ఎస్ సెక్షన్లు 65(1), 64(2)(ఎం), 64(2)(ఎఫ్), 351(2), పోక్సో చట్టం–2012లోని సెక్షన్లు 5(ఎల్), 5(ఎన్) రెడ్‌విత్ 6 కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలి వాంగ్మూలాన్ని భరోసా కేంద్రం ద్వారా వీడియో రికార్డు చేసిన పోలీసులు, తదుపరి వైద్య పరీక్షల కోసం ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మహిళా శక్తిని వ్యాపార శక్తిగా మార్చడమే లక్ష్యం

- మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి
- ఇంక్యుబేటర్ కార్యక్రమంతో మహిళా వ్యాపారాలకు కొత్త దిశ
- రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకు గ్రాంట్ పొందే అవకాశం
- మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు: మంత్రి సీతక్క




కాకతీయ, ములుగు ప్రతినిధి : మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం సహాయక సంఘాల సభ్యులను విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళలు ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సెర్ప్, బిట్స్ పిలానీ హైదరాబాద్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి ఇంక్యుబేటర్ ప్రోగ్రామ్ అవగాహన, ప్రణాళిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

### రూ.15 లక్షల వరకు గ్రాంట్

గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాపారాలను గుర్తించి, వాటికి నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్, ఆర్థిక సహకారం అందించడమే కార్యక్రమం ఉద్దేశమని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 మహిళా ఆధారిత వ్యాపారాలను గుర్తించి అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. అర్హులైన మహిళా వ్యాపారవేత్తలకు వ్యాపార విస్తరణ, యంత్రాలు, పరికరాలు, ముడిసరుకు తదితర అవసరాల కోసం రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకు గ్రాంట్ పొందే అవకాశం ఉందన్నారు.

### ములుగులో రూ.13 కోట్ల వడ్డీ చెల్లింపు

మహిళలు ఆర్థికంగా బలోపేతమైతే కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని సీతక్క అన్నారు. వడ్డీలేని రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు మహిళా సంఘాల రుణాలపై వడ్డీని ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. ములుగు జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.13 కోట్ల వడ్డీ మొత్తాన్ని మహిళలకు తిరిగి చెల్లించినట్లు వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో పాటు మండల సమాఖ్యలకు బస్సులు అందించి ఆదాయ మార్గాలు కల్పిస్తున్నామని తెలిపారు. మేడారం, రామప్ప, లక్నవరం, బొగత జలపాతం, గోదావరి తీరం వంటి పర్యాటక ప్రాంతాలను మహిళల ఆర్థికాభివృద్ధికి అనుసంధానం చేయాలని మంత్రి సూచించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో క్యాంటీన్లు, మొబైల్ టిఫిన్ కేంద్రాలు, స్థానిక ఆహార ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇప్పపువ్వు, అరటి, మిరప వంటి స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించి ప్యాకేజింగ్, మార్కెటింగ్ చేయడం ద్వారా స్థిరమైన ఆదాయం పొందవచ్చన్నారు. ప్రతి మండలం నుంచి వ్యాపార ఆసక్తి, వినూత్న ఆలోచనలు ఉన్న మహిళలను గుర్తించి ఇంక్యుబేటర్ శిక్షణకు ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ఆగస్టు 16న సమ్మక్క–సారలమ్మ సన్నిధి నుంచి ప్రారంభించనున్నట్లు సీతక్క తెలిపారు. అలాగే జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సుమారు రూ.1.50 కోట్లతో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఆర్డీఓ రవీందర్, బిట్స్ పిలానీ ఇంక్యుబేటర్ ప్రాజెక్ట్ మేనేజర్ నవీన్‌కృష్ణ, ములుగు మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## శ్రావణంలోనైనా రాజన్న దర్శనం కల్పించండి

- 9నెలలుగా దర్శనానికి దూరమైన భక్తులు
- శ్రావణమాసంలో ప్రత్యామ్నాయ దర్శన ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



కాకతీయ, వేములవాడ : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర స్వామివారి ఆలయంలో అభివృద్ధి పనుల పేరుతో తొమ్మిది నెలలుగా భక్తులకు దర్శనం పరిమితం చేయడం, నిలిపివేయడం వల్ల వారి మనోభావాలు దెబ్బతింటున్నాయని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. శ్రావణమాసంలోనైనా భక్తులందరికీ రాజన్న దర్శన భాగ్యం కల్పించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నెలల తరబడి దర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులకు ఇకపై జాప్యం చేయకుండా శ్రావణమాసంలోనే దర్శనానికి అవకాశం కల్పించాలని బీజేపీ తరఫున డిమాండ్ చేశారు. ఆలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పటికీ భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ దర్శన ఏర్పాట్లు చేయాలని కోరారు. అభివృద్ధి పనులకు భక్తులు సహకరిస్తారని, అయితే వాటి పేరుతో వారి ఆధ్యాత్మిక హక్కులు, మనోభావాలు దెబ్బతినకుండా ప్రభుత్వం, ఆలయ అధికారులు తక్షణ నిర్ణయం తీసుకోవాలని గోపి అన్నారు. శ్రావణమాసం అత్యంత పవిత్రమైనదని, ఈ సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు రాజన్నను దర్శించుకోవాలని కోరుకుంటారని పేర్కొన్నారు. భక్తుల విశ్వాసాన్ని గౌరవించి వెంటనే దర్శన ఏర్పాట్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- గ్రామాల అభివృద్ధిలో ఉప సర్పంచ్‌లది కీలక పాత్ర
- ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బోట్ల కార్తీక్
- ములుగులో ఉప సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనం
- నూతన మండలాల కమిటీల నియామకం



కాకతీయ, ములుగు ప్రతినిధి : రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బోట్ల కార్తీక్ అన్నారు. గురువారం మేడారం సమ్మక్క–సారలమ్మ తల్లుల సన్నిధిలో ములుగు జిల్లా ఉప సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉప సర్పంచ్‌లు హాజరై గ్రామాల అభివృద్ధి, స్థానిక సంస్థల్లో తమ పాత్ర, ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. ములుగు జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అంకం సురేష్ ముదిరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోట్ల కార్తీక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ఉప సర్పంచ్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా సప్పిడి సంజనను నియమించారు. ఏటూరునాగారం మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా కోడి ధర్మరాజు, గోవిందరావుపేట మండల అధ్యక్షుడిగా వెంగల రాజును నియమించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఇటవీన రాజు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత ప్రకాశ్, జిల్లా కార్యదర్శి చింతనిపుల రఘు, వివిధ మండలాల అధ్యక్షులు, అన్ని గ్రామాల ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ఖర్గేపై వివక్షకు నిరసనగా కాంగ్రెస్ సత్యాగ్రహం

- ఆగస్టు 14న హనుమకొండలో భారీ నిరసన యాత్ర
- అంబేడ్కర్ సెంటర్ నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు ర్యాలీ
- గాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహం
- హన్మకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి



కాకతీయ, హనుమకొండ : ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో జరిగినట్లు పేర్కొంటున్న కుల వివక్ష, అవమానకర చర్యను నిరసిస్తూ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 14న భారీ నిరసన యాత్ర, సత్యాగ్రహం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు అంబేద్కర్ సెంటర్ నుంచి నిరసన యాత్ర ప్రారంభమై పబ్లిక్ గార్డె న్ వరకు కొనసాగుతుందని చెప్పారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఖర్గే దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడం వల్లే బహిరంగ సభ అనంతరం వేదికను గంగాజలంతో కడిగి శుద్ధీకరణ చేశారనే ఆరోపణలను ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలు రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సామాజిక న్యాయం, మానవ హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. కుల వివక్ష, అస్పృశ్యతను ప్రోత్సహించే ధోరణులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### పెద్ద సంఖ్యలో తరలిరావాలి

ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పీసీసీ, డీసీసీ పదాధికారులు, కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల నాయకులు, మండల, పట్టణ, డివిజన్ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## ఎఫ్‌బీఓ నవీన్ మృతికి అటవీ సిబ్బంది సంతాపం



- నిందితులపై కఠిన చర్యలకు డిమాండ్
- కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

కాకతీయ, ఏటూరునాగారం రూరల్ : వన్యప్రాణుల వేట కోసం వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చుకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) భానోత్ నవీన్ బలయ్యారు. బుధవారం బూర్గంపాడు మండలం నకిరిపేట సమీపంలోని అటవీ ప్రాంతంలో విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన నవీన్ విద్యుత్ ఉచ్చులో చిక్కుకుని విద్యుదాఘాతంతో మృతి చెందారు. విధి నిర్వహణలో ఉండగా వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చుకు బలికావడంతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నవీన్ మృతికి నిరసనగా, ఘటనకు కారణమైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏటూరునాగారం ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో అటవీశాఖ అధికారులు, సిబ్బంది సంతాప కార్యక్రమం నిర్వహించారు. నవీన్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. అటవీ ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం, అటవీశాఖ కఠిన చర్యలు చేపట్టాలని కోరారు.

### వేటగాళ్లపై చర్యలు తీసుకోవాలి

సింగరేణి మండలం వెంకట్యాతండాకు చెందిన మాజీ ఎంపీపీ భానోత్ దేవ్లా నాయక్ కుమారుడైన నవీన్ చెరువు సింగారం వెస్ట్ బీట్‌లో ఎఫ్‌బీఓగా విధులు నిర్వహిస్తున్నారు. వన్యప్రాణుల వేటను అరికట్టేందుకు అటవీ ప్రాంతంలో విధులు నిర్వహిస్తుండగానే ప్రాణాలు కోల్పోవడం పట్ల సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు కారణమైన వ్యక్తులను గుర్తించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని అటవీశాఖ సిబ్బంది కోరారు. కార్యక్రమంలో ఏటూరునాగారం డబ్ల్యూఎల్ఎం డీఎఫ్ఓ రమేష్, తాడ్వాయి డబ్ల్యూఎల్ఎం ఎఫ్ఆర్ఓ రమేష్, ఏటూరునాగారం దక్షిణం ఎఫ్ఆర్ఓ అబ్దుల్ రెహ్మాన్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్, ఏటూరునాగారం నార్త్ ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ అశోక్, మంగపేట ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ లాయక్ హుస్సేన్‌తో పాటు వివిధ రేంజ్‌ల డీవైఆర్ఓలు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు. మిగిలిన రేంజ్‌ల సిబ్బంది పసరా ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన సంతాప సభలో పాల్గొన్నారు.



# కాకతీయ సినిమా

శుక్రవారం
14 ఆగస్టు 2026

# రూ.160 కోట్లకు 'జైలర్ 2' ఓటీటీ డీల్!

## అమెజాన్ ప్రైమ్ వీడియోకు డిజిటల్ హక్కులు
## తొలి భాగం కంటే భారీగా పెరిగిన ధర
## అక్టోబర్ 15న థియేటర్లలో విడుదల

**కాకతీయ, సినిమా :** సూపర్‌స్టార్ రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'జైలర్ 2' చిత్రానికి సంబంధించి ఓటీటీ డీల్ సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఈ సినిమా పోస్ట్ థియేట్రికల్ డిజిటల్ హక్కుల ను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో రూ.160 కోట్లకు దక్కించుకున్నట్లు సమాచారం. 'జైలర్' తొలి భాగం డిజిటల్ హక్కులు రూ.100 కోట్లకు అమ్ముడైనట్లు ప్రచారం జరిగింది. ఇప్పుడు సీక్వెల్‌కు అంతకుమించిన మొత్తానికి డీల్ కుదిరిన ట్లు సమాచారం. దీంతో తమిళ చిత్ర పరిశ్రమలో భారీ ఓటీటీ ఒప్పందాల్లో ఇది ఒకటిగా నిలిచే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 15, 2026న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. టైగర్ ముత్తువేల్ పాండ్యన్‌గా రజనీకాంత్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రాను న్నారు. ఎస్.జె. సూర్య, రమ్యకృష్ణ, యోగిబాబు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. విజయ్ కార్తీక్ కణ్ణన్ ఛా యాగ్రహణం వహిస్తున్నారు. థియేట్రికల్ విడుదలకు ముందే భారీ మొత్తా నికి ఓటీటీ హక్కులు విక్రయమైనట్లు వార్తలు రావడం సినిమాపై నెలకొన్న అంచనాలను మరింత పెంచుతోంది.




# యూఎస్‌లో 'కొరియన్ కనకరాజు' దూకుడు

**కాకతీయ,సినిమా :** మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా రితికా నాయక్ హీరోయిన్‌గా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు'. చాలా కాలంగా ఎదురుచూస్తున్న కంబ్యాక్ హిట్‌ను ఈ సినిమాతో వరుణ్ తేజ్ అందుకున్నారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు యూఎస్ మార్కెట్‌లోనూ ఈ సినిమా మంచి వసూళ్లు సాధిస్తోంది. తాజాగా నార్త్ అమెరికాలో 'కొరియన్ కనకరాజు' 6 లక్షల డాలర్ల గ్రాస్ మార్క్‌ను దాటినట్లు సమాచారం. దీంతో అక్కడ సినిమా స్ట్రాంగ్ పెర్ఫార్మెన్స్ కొనసాగిస్తోంది. ఇదే సమయంలో బ్లాక్‌బస్టర్ టాక్ సొంతం చేసుకున్న కోలీవుడ్ చిత్రం 'డీసీ' రెండు వెర్షన్లలో విడుదలైనప్పటికీ నార్త్ అమెరికాలో ఇంకా హాఫ్ మిలియన్ డాలర్ల మార్క్‌ను అందుకోలేదని ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో యూఎస్ మార్కెట్‌లో 'కొరియన్ కనకరాజు' జోరు కొనసాగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. థమన్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ నిర్మించింది.

# డిసెంబర్‌లో 'స్లమ్‌డాగ్.. 33 టెంపుల్ రోడ్'?

- విజయ్ సేతుపతి–పూరీ జగన్నాథ్ కాంబోపై ఆసక్తి
- సెప్టెంబర్, అక్టోబర్‌లో సేతుపతి చిత్రాల విడుదల
- వాటి తర్వాతే పూరీ సినిమా విడుదలకు సన్నాహాలు



**కాకతీయ,సినిమా :** వెర్సటైల్ యాక్టర్ విజయ్ సేతుపతి, దర్శకుడు పూరీ జగ న్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'స్లమ్‌డాగ్: 33 టెంపుల్ రోడ్'పై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే చి త్రీకరణ పూర్తికాగా.. టీజర్‌తో సినిమాపై మంచి బజ్ ఏర్పడింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులతో పాటు నాన్ థియేట్రికల్ డీల్స్‌ను పూర్తి చేసే పనిలో చిత్రబృందం ఉంది. విజయ్ సేతుపతికి తమిళంలో మంచి మార్కెట్ ఉండటంతో తెలుగుతో పాటు తమిళంలోనూ ఒకేసారి విడుదల చేయాలని మేకర్స్ భావిస్తు న్నట్లు సమాచారం. అయితే సేతుపతి నటించిన ఇతర చిత్రాల విడుదల తేదీలు ఈ సినిమా రిలీజ్‌పై ప్రభావం చూపుతున్నాయి. 'ట్రైన్' సెప్టెంబర్‌కు వాయిదా పడగా.. 'బత్తా'ను అక్టోబర్ 1న విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ రెండు చిత్రాలు వరుసగా థియేటర్లలోకి రానుండటంతో 'స్లమ్‌డాగ్: 33 టెంపుల్ రోడ్'ను వాటి తర్వాత విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అన్నీ అనుకున్న ట్లు జరిగితే డిసెంబర్‌లో పూరీ జగన్నాథ్-విజయ్ సేతుపతి కాంబినేషన్ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# మోహన్‌లాల్ కూతురు 'తుడక్కం'తో దుమ్మురేపుతోంది!

- విస్మయ తొలి సినిమాకే భారీ వసూళ్లు
- ఆరు రోజుల్లో రూ.30 కోట్లకు పైగా గ్రాస్
- కేరళలో రూ.15 కోట్లు.. ఓవర్సీస్‌లో మరో రూ.15 కోట్లు



**కాకతీయ,సినిమా :** మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్ నట వారసులుగా ఆయన కుమారుడు ప్రణవ్ మోహన్‌లాల్, కుమార్తె విస్మయ మోహన్‌లాల్ వెండితెరకు పరిచ యమయ్యారు. గతేడాది ప్రణవ్ హారర్ చిత్రం 'డీయస్ ఈరే'తో ఆకట్టుకోగా.. ఈ ఏడాది విస్మయ 'తుడక్కం' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. యాక్షన్, సర్వైవల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు రాబడు తున్నట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. దర్శకుడు జూడే ఆంథని జోసెఫ్ తెరకెక్కించిన 'తుడక్కం' కేరళతో పాటు ఓవర్సీస్ మార్కెట్‌లోనూ వసూళ్ల జోరు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. విడుదలైన ఆరు రోజుల్లో కేరళలోనే సుమారు రూ.15 కోట్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. ఓవర్సీస్ మార్కెట్‌లో మరో రూ.15 కోట్ల గ్రాస్ రాబట్టినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో విస్మయ తొలి చిత్రమే ఆరు రోజుల్లో రూ.30 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు తెలుస్తోంది. రోజురోజుకూ వసూళ్లు పెరుగుతుండటంతో ఈ సినిమా లాంగ్‌రన్‌లో మరింత దూసుకెళ్లే అవకాశముందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరి ఫుల్ రన్‌లో 'తుడక్కం' ఎక్కడి వరకు వెళ్తుందో చూడాలి.



# విండీస్‌కు మళ్లీ క్వాలిఫయర్ కష్టాలు!

- భారత్‌పై గెలిచినా నేరుగా ప్రపంచకప్ బెర్త్ దక్కే అవకాశం లేదు
- వరుసగా రెండోసారి మెగా టోర్నీకి దూరమయ్యే ప్రమాదం
- ఐసీసీ ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌కు 10 జట్ల మధ్య పోరు.. టాప్-4కు బెర్తులు
- వెస్టిండీస్ జట్టుకు 2023లోనూ చేదు అనుభవం
- ఈసారి క్వాలిఫయర్స్‌లో సత్తా చాటాల్సిందే

కాకతీయ Sport

**కాకతీయ, స్పోర్ట్స్ డెస్క్ :** ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌ను శాసించిన వెస్టిండీస్ ఇప్పుడు వన్డే ప్రపంచకప్ బెర్తు కోసం పోరాడాల్సిన పరిస్థితిలో పడింది. భీకర హిట్టర్లు, అద్భుత ఆల్‌రౌండర్లతో ప్రత్యర్థులను గడగడలాడించిన కరీబియన్ జట్టు.. 2027 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించే అవకా శాన్ని కోల్పోయింది. ఐర్లాండ్‌పై అఫ్గానిస్థాన్ విజయం సా ధించడంతో ర్యాంకింగ్స్ ఆధారంగా నేరుగా ప్రపంచకప్‌లో కి వెళ్లే జట్ల జాబితాలో విండీస్‌కు చోటు లేకుండా పోయింది. దీంతో 2027 ఫిబ్రవరిలో జరగనున్న క్వాలిఫయర్ టోర్నీలో తప్పక సత్తా చాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు వన్డే ప్రపంచకప్‌ను రెండుసార్లు ముద్దాడిన వెస్టిండీస్‌కు ఇది తీవ్ర పతనానికి నిదర్శనంగా మారింది. 2023 ప్రపంచక ప్‌కు కూడా నేరుగా అర్హత సాధించలేకపోయిన ఆ జట్టు.. క్వాలిఫయర్‌లోనూ విఫలమై మెగా టోర్నీకి దూరమైంది. ఇప్పుడు వరుసగా రెండో ప్రపంచకప్‌కు కూడా అదే పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

**భారత్‌పై గెలిచినా ప్రయోజనం లేదు**

2027 ప్రపంచకప్‌కు ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వే నేరుగా అర్హత సాధించనున్నాయి. మిగిలిన ఎనిమిది బెర్తులను నిర్ణీత కటాఫ్ తేదీ నాటికి వన్డే ర్యాంకిం గ్స్‌లో మెరుగైన స్థానాల్లో ఉన్న జట్లకు కేటాయించనున్నా రు. అఫ్గానిస్థాన్ తాజాగా ఐర్లాండ్‌పై విజయం సాధించడం తో అవసరమైన ర్యాంకింగ్ స్థానాన్ని ఖాయం చేసుకుంది. ప్రస్తుతం వెస్టిండీస్ 10వ స్థానంలో ఉంది. కటాఫ్ తేదీకి ముందు భారత్‌తో ఆ జట్టుకు రెండు వన్డేలు ఉన్నప్పటికీ.. వాటిలో టీమ్ఇండియాపై గెలిచినా అఫ్గానిస్థాన్‌ను దాటి నేరుగా ప్రపంచకప్ బెర్తు సాధించే పరిస్థితి లేదని తెలుస్తోం ది. దీంతో విండీస్ క్వాలిఫయర్ ఆడటం తప్పనిసరైంది. వరుసగా మూడోసారి క్వాలిఫయర్ దశకు వెళ్లాల్సి రావడం ఆ జట్టు ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది.

**క్వాలిఫయర్స్‌లో టాప్-4కే చోటు**

2027 ఫిబ్రవరిలో 10 జట్ల మధ్య క్వాలిఫయర్ టోర్నీ జర గనుంది. ఇందులో ర్యాంకింగ్స్ ఆధారంగా అట్టడుగున ఉన్న రెండు పూర్తి స్థాయి సభ్య దేశాలు వెస్టిండీస్, ఐర్లాండ్ పాల్గొంటాయి. క్రికెట్ వరల్డ్‌కప్ లీగ్ 2 నుంచి నాలుగు జట్లు, క్వాలిఫయర్ ప్లే ఆఫ్స్ నుంచి మరో నాలుగు జట్లు పోటీపడతాయి. ప్లే ఆఫ్స్‌లో లీగ్ 2లో అట్టడుగున ఉన్న నాలుగు జట్లతో పాటు ఛాలెంజ్ లీగ్ నుంచి వచ్చే నాలుగు జట్లు తలపడతాయి. ఈ విధంగా ఎంపికైన 10 జట్ల మధ్య క్వాలిఫయర్ పోరు సాగుతుంది. ఇందులో టాప్ 4లో నిలిచిన జట్లు ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తా యి. అయితే ఆ తర్వాత కూడా పోరు ఉంటుంది. టాప్‌లో నిలిచిన జట్టు నేరుగా రెండో రౌండ్‌కు చేరుకుంటుంది. మిగిలిన మూడు జట్లు సూపర్ సిరీస్ రౌండ్ ఆడతాయి. అందులో అత్యుత్తమంగా నిలిచిన మరో జట్టుకు రెండో రౌండ్ బెర్తు దక్కుతుంది. మిగిలిన రెండు జట్లు నిష్క్రమి స్తాయి. 2023 ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లోనూ వెస్టిం డీస్ తీవ్రంగా నిరాశపరిచింది. సూపర్ 6 దశలో ఐదో స్థానంతో సరిపెట్టుకుని ప్రపంచకప్‌కు దూరమైంది. క్రికెట్ చరిత్రలో ఆ జట్టు ప్రపంచకప్ ఆడకుండా ఉండటం అదే తొలిసారి. ఆ దెబ్బ నుంచి కోలుకోకముం దే 2025 ఛాంపియన్స్ ట్రోఫీకీ దూరమైంది. 2013 తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీలో వెస్టిండీస్ ఆడలేకపోయిం ది. ఇప్పుడు 2027 ప్రపంచకప్ బెర్తు కోసం మరోసారి క్వాలిఫయర్ అడ్డంకిని అధిగమించాల్సి రావడం కరీ బియన్ క్రికెట్ పతనాన్ని స్పష్టం చేస్తోంది. ఈసారి క్వా లిఫయర్‌లోనూ విఫలమైతే.. వరుసగా రెండోసారి వన్డే ప్రపంచకప్ ప్రధాన టోర్నీకి దూరమైన జట్టుగా వెస్టిండీస్ మిగిలిపోతుంది.

# స్టార్క్ వరల్డ్ రికార్డు.. కపిల్ రికార్డు సమం!

- టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన ఎడమచేతి వాటం బౌలర్‌గా ఘనత
- 434 వికెట్లతో రంగన హెరాత్ రికార్డు బద్దలు
- కపిల్ దేవ్ రికార్డును సమం చేసిన ఆసీస్ పేసర్

**కాకతీయ, స్పోర్ట్స్ డెస్క్:** ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ టెస్టు క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. బంగ్లాదే శ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో షద్మాన్ ఇస్లామ్‌ను ఔట్ చేయడం ద్వారా టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన ఎడమచేతి వాటం బౌలర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో శ్రీలంక మాజీ బౌలర్ రంగన హెరాత్ (433) రికార్డును అధిగమించా డు. స్టార్క్ 106 టెస్టుల్లో ఇప్పటివరకు 434 వికెట్లు పడగొట్టాడు. దీంతో 93 టెస్టుల్లో 433 వికెట్లు తీసిన హెరాత్‌ను వెనక్కి నెట్టాడు. ఈ జాబితాలో వసీం అక్రమ్ (414), డేనియల్ వెట్టోరి (362), చమిందా వాస్ (355), రవీంద్ర జడేజా (348) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. 434వ వికెట్‌తో స్టార్క్ భారత దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్ దేవ్ రికార్డును సమం చేశాడు. కపిల్ 131 టెస్టుల్లో 434 వికెట్లు సాధించాడు. స్టార్క్ మాత్రం 106 మ్యాచ్‌ల్లోనే ఈ మైలురాయిని అం దుకోవడం విశేషం. మరో ఆరు వికెట్లు తీస్తే డేల్ స్టెయిన్ (439)ను అధిగమించి టెస్టు వికెట్ల జాబితాలో టాప్ 10లోకి చేరే అవకాశం ఉంది. తొలి టెస్టులో ఆస్ట్రేలియా 198 పరుగులకు ఆలౌట్ కాగా, బంగ్లాదే శ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్‌కు 96 పరుగులు చేసింది.




Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266